

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

కరీంనగర్ fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-11-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 286 పేజీలు: 8+16 వెల: 6.50

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఐదు బస్సులు దగ్ధం

తనిష్క్ దోపిడిలో ఇద్దరి అరెస్టు

3

విదేశాలకు వెళ్లొస్తే అధికారం రాదు

జనం ఘోష వినాలి

రాహుల్‌పై అమిత్ షా సెటైర్లు



5

భారత్ సంచలన విజయం

న్యూజిలాండ్‌పై 3-1తో సిరీస్ కైవసం

అర్ష్‌దీప్ సింగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు

ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గుర్నూర్ బ్రార్‌కు

బౌలర్ల పోరాటంతోనే గెలిచాం: శ్రేయస్ అయ్యర్



ఆటలో

మావోయిస్టులతో ఆదివాసీలకే నష్టం!



వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

గిరిజనులను గాలికొదిలేసిన గత ప్రభుత్వాలు: ప్రధాని మోడీ

రూ.30వేల కోట్ల గిరిజన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం

బిర్సా ముండా 151వ జయంతికి ప్రధాని హాజరు

హైదరాబాద్ విద్యార్థి సహా గిరిజనులతో సంభాషణ

న్యూఢిల్లీ, నవంబరు 15: మావోయిస్టు హింస వల్ల గిరిజన సమాజాలు అత్యంత దారుణంగా నష్టపోయాయని, మావోయిస్టుల ప్రభావం ఉన్న ప్రాంతాల్లో వారికి కనీసం ఓటు హక్కు కూడా లేకుండా చేశారని ప్రధాని నరేంద్ర మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు గిరిజనులను వారిగతికి వదిలేశాయని ఆయన విమర్శించారు. మావోయిస్టులు బలవంతంగా పిల్లలను తీసుకెళ్లినప్పుడు, గిరిజన యువతులను అపహరించినప్పుడు గత ప్రభుత్వాలు మౌనంగా ఉండిపోయాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. "నక్సలైట్లు గిరిజన సమాజాలకు ఓటు హక్కును నిరాకరించారు, కానీ అప్పటి ప్రభుత్వాలు కేవలం మూగ ప్రేక్షకులుగా ఉండిపోయాయి అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. అయితే, మావోయిస్టు హింస అంతం కావడంతో పరిస్థితి మారిందని, ఇప్పుడు గిరిజన తల్లులు, సోదరీమణులు సురక్షితంగా భావిస్తూ ప్రభుత్వానికి ఆశీస్సులు అందిస్తున్నారని ఆయన చెప్పారు.

>>2

మహారాష్ట్రను ఒప్పించండి

తుమ్మిడిహెట్టి నిర్మాణం తెలంగాణకు ప్రాణం

152 మీటర్ల వద్ద ప్రాజక్టును నిర్మించాలి

పాలమూరు, సీతమ్మసాగర్, డిండి ప్రాజెక్టులకు అనుమతులు ఇప్పించండి

ప్రధాని మోడీని కోరిన సిఎం రేవంత్‌రెడ్డి

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ప్రధానికి ఆహ్వానం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు15: తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, అంతరాష్ట్ర వివాదాల పరిష్కారానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల పనులు వేగవంతం చేశామని, భూ నిర్వాసితులకు పరిహారం వేగంగా అందజేస్తున్నామని ప్రధానమంత్రికి సీఎం తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి అధికారిక నివాసంలో ఆదివారం సమావేశం అయ్యారు. సమావేశంలో కేంద్ర క్రీడా, యువజన వ్యవహారాల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును +152 మీటర్ల వద్ద నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో భేటీ అయిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మహారాష్ట్రలో ముంపునకు

>>2



ఆదివారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ విజ్ఞప్తులు పరిశీలిస్తామని ప్రధాని మోడీ హామీ

సాగునీటి ప్రాజెక్టులు ఆలస్యం కారాదని పిఎం వ్యాఖ్య

తుమ్మిడి పెట్టికి సవాక రిస్తాం..

ఖేలో ఇండియా లోగో ఆవిష్కరణ

క్రీడల నిర్వహణకు రూ. 203 కోట్లు: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: తెలంగాణ వేదికగా డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఎనిమిదవ ఖేలోఇండియా యూత్ గేమ్స్-2026 కు సంబంధించిన లోగో, మస్కట్‌ను కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్

>>2

చత్తీస్‌గఢ్ సిఎంతో రేపు భేటీ

సమ్మక్క-సారక్క బ్యారేజికి అనుమతిపై చర్చలు

ఎన్‌ఒసి లభిస్తే వేగంగా ప్రాజెక్టు నిర్మాణం

డిపిఆర్‌కు నాటి నిబంధనలనే పరిశీలించాలి

ఢిల్లీలో మీడియాతో మంత్రి ఉత్తమ్



ఆదివారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి,రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కీలక సమావేశం నిర్వహించారు. ఆదివారం ఢిల్లీలోని ప్రధాని నివాసం లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఈ భేటీ జరిగింది. అనంతరం సహచర మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి పర్యావరణ అనుమతులు వేగవంతం చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేశామని,మూడు ప్రాజెక్టులపై గత, ప్రస్తుత ప్రభుత్వాలు రూ.50 వేల కోట్లు వెచ్చించాయని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతా పర్యావరణ దరఖాస్తుల పరిశీలనలో జాప్యం అవుతుందని, దేశవ్యాప్తంగా అనుమతుల జాప్యంతో నిలిచిన సాగునీటి ప్రాజెక్టులపై ప్రధాని చొరవ చూపాలని విజ్ఞప్తి చేశామన్నారు, తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల పూర్తిస్థాయి నీటిమట్టానికి మహారాష్ట్ర అంగీకారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ సందర్భంగా తుమ్మిడిహట్టి ప్రాధాన్యాన్ని పూర్తి గణాంకాలతో సహా ప్రధాని మోడీకి వివరించామన్నారు. మహారాష్ట్రలో అదనపు ముంపునకు పరిహారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.సమ్మక్క-సారలమ్మ బ్యారేజీకి ఛత్తీస్‌గఢ్ ఎన్ ఓసీ త్వరగా ఇప్పించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశామన్నారు.ఐఐటీ ఖరగ్‌పూర్ ముంపు నివేదిక తెప్పించామని,అదనపు డీపీఆర్‌కు కోరిన మొత్తాన్ని జమ చేశామన్నారు. సమ్మక్క-సారలమ్మ డీపీఆర్‌ను సమర్పించిన నాటి నిబంధ నలతోనే పరిశీలించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామన్నారు. ఈ విషయంలో ఈనెల 16న(సోమవారం) కేంద్ర జల సంఘం చైర్మన్‌ను కలవనున్నామని పేర్కొన్నారు. మంగళవారం (నవంబర్ 17న) ఛత్తీస్‌గఢ్ సీఎంతో సిఎం రేవంత్‌రెడ్డి,తాను భేటీఅవుతామన్నారు. 2027-28లో పీఎం కృషి సించా యీ యోజన కింద నాలుగు పథకాలకు రూ.5,856 కోట్ల ప్రతిపాదన చేశామని, సీతమ్మసాగర్-సీతారామ సమీకృత పథకానికి రూ. 5,183 కోట్లు కోరామన్నారు. మోడికుంట వాగుకు రూ.392

>>2



4.63 లక్షల మందికి కొత్త పెన్షన్లు

18లోగా లబ్ధిదారులకు పత్రాలు అందజేత

హైదరాబాద్,నవంబరు15,ప్రభాత వార్త: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేయూత పథకం కింద కొత్తగా 4,63,857 మందికి పింఛన్లను మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీపావళి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మంజూరు పత్రాల పంపిణీని ప్రారంభించగా, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల స్థాయిలో మంత్రులు, ప్రజాప్రతినిధుల ద్వారా లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్నారు.ఈ నెల 18 నాటికి ఈ పంపిణీ ప్రక్రియ పూర్తి కానుంది.మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని

>>2

ఆందోళనలతో అట్టుడికిన పోర్చుగల్

5

ఇళ్ల ధరలు, అద్దెల పెంపు పట్ల భారీగా నిరసనలు

ట్రంప్ గోల్ఫ్ కోర్ట్ విస్తరణ ప్రణాళికలకు కోర్టు బ్రేక్

5

అమెరికా అధ్యక్షునికి మరో ఎదురుదెబ్బ



పసుపుతో కాసుల పంట

రికార్డు స్థాయికి చేరిన ధర

క్వింటాలు రూ.28 వేలు పైనే

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాత వార్త: ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడ్డ వర్షాభావ పరిస్థితులతో సాగుతో పాటు, తగ్గిన దిగుబడి, దీనికి తోడు విదేశాల్లో పెరిగిన డిమాండ్ కారణంగా వ్యవసాయ మార్కెట్లలో పసుపు ధరలు సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. వేసవిలోనే పంట చేతికొచ్చినా నిల్వ చేసుకున్న రైతులకు కాసుల వర్షం కురుస్తోంది. ఇటీవల వరకూ రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.12 వేలు పలికిన పసుపు ధర గత రెండు, మూడు రోజులుగా ఆకాశాన్నంటే

>>2

ఆఖరి ఛార్జిషీటు రెడీ!

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

ఎ-1గా కెసిఆర్, ఎ-2గా కెటిఆర్?

ప్రజాప్రతినిధులతో పాటు న్యాయమూర్తులు, జర్నలిస్టులు, వ్యాపారుల ఫోన్లు ట్యాప్ అయినట్లు అభియోగాలు

విచారణను పర్యవేక్షిస్తున్న కొత్త సిపి భగవత్



హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపి, పోలీసు శాఖలో దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ కేసుకు సంబంధించి తుది ఛార్జిషీట్‌ను దాఖలు చేసేందుకు సిట్ సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇందులో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రధాన నిందితుడిగా ఆయన కుమారుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండవ నిందితుడిగా పేర్కొనే అవకాశాలున్నా యని తెలిసింది. 2024 ఫిబ్రవరి నెలలో వెలుగు చూసిన ఈ కేసుపై మొదట పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవగా ఆ తరువాత దీన్ని విచారించేందుకు సిట్‌ను ఏర్పాటు చేశారు. దీని తరువాత ఈ కేసులో

>>2



రాహుల్‌కు రేవంత్ బాడీగార్డా?

బైక్ వెనుక మంత్రులు పరిగెత్తడం ఏమిటి?: కెటిఆర్

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వేదికగా తీవ్రంగా స్పందించారు. తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు,మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని

>>2

జోరు తగ్గిన గోదావరి

ఎల్‌నినో ప్రభావమే కారణం..



తాగునీటి కోసం ముందస్తు చర్యలు

సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పూర్తయితే 36 టిఎంసిల నీటి నిల్వ

350 మె.వా విద్యుదుత్పత్తికి అవకాశం: మంత్రి తుమ్మల

అశ్వాపురం,ప్రభాతవార్త,నవంబరు 15: ఎల్‌నినో ప్రభావంతో గోదావరి నదిలో నీటి ప్రవాహాలు తగ్గుతున్న నేపథ్యంలో రానున్న వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

>>2



ఆదివారం న్యూఢిల్లీలో ఖేలో ఇండియా లోగోను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ. చిత్రంలో సిఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్ కుమార్, వాకిటి శ్రీహరి, సిఎస్ తదితరులు

లోగో ఆవిష్కరణ

>> మాండవీయ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఈ క్రీడా సంబరాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.21 కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.203.13 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను కేవలం క్రీడల నిర్వహణకే పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని స్టేడియాల్లో శాశ్వత మౌలిక వసతుల కల్పనకు వినియోగిస్తామని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులోనూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సాధనకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈసారి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మొత్తం 27 క్రీడాంశాలు ఉండగా, తెలంగాణ సంప్రదాయ క్రీడ అయిన కర్రసామును కూడా చేర్చడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా 7 వేల మందికి పైగా క్రీడాకారులతో పాటు సుమారు 1,200 మంది కోచ్‌లు, సహాయక సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొననున్నారని వెల్లడించారు.

హైదరాబాద్‌తో పాటు హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మత్తు వదలండి.. మైదానాలు చేరండి అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన నశా ముక్త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి, క్రీడలు, వ్యాయామం వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ద్వారా తెలంగాణ క్రీడా ప్రతిభ దేశవ్యాప్తంగా చాటడంతో పాటు, రాష్ట్రాన్ని క్రీడా రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

ఆఖరి ఛార్జిషీటు రెడీ!

>> ఇప్పటి వరకు ఎస్ఐబికి చెందిన నాటి డిఎస్పి దుగ్యాల ప్రణీత్ రావు, అదనపు ఎస్పి భుజంగరావు, సిటీ సెక్యూరిటీ వింగ్ అదనపు ఎస్పి తిరుపతన్నతో పాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావు లను సిట్ అరెస్టు చేసింది. ఈ కేసులో కీలక నిందితుడుగా వున్న నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావును వారం రోజుల పాటు పోలీసు కస్టడీ లో వుంచారు. మరో నిందితుడు శ్రవణ్ రావు మధ్యంతర బెయిల్ పొందాడు. ఈ కేసులో 600 మందికి పైగా సాక్షుల వాంగ్మూలం సేకరించి 2024 జూన్‌లోనే నాంపల్లి కోర్టులో మొదటి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి అనేక మంది వాంగ్మూలం నేటికీ కొనసాగుతు ండడం గమనార్హం. బిఆర్ఎస్ హయాంలో నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో పాటు ప్రతిపక్ష నేతలు, ప్రముఖుల ఫోన్‌లను ఎస్ఐబి అధి కారులు నిబంధనలకు విరుద్ధంగా ట్యాపింగ్ చేసినట్లు సిట్ అభియోగంలో ప్రధాన అంశం. ఇది చట్టవిరుద్ధమని తెలిసినప్పటికీ నాటి బిఆర్ఎస్ పాలకలు అనుమతులు ఇచ్చారని, తమకు అనుకూలంగా ఉండే అధికారులను ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ వంటి కీలక విభాగాల్లో నియమించి ఈ అక్రమాలకు పాల్పడ్డారని సిట్ కోర్టుకు సమర్పించిన అభియోగంలో వుంది. ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, జర్నలిస్టులు, వ్యాపార వేత్తల తో పాటు సెలబ్రిటీల ఫోన్లను ట్యాప్ చేయడం వెనుక భారీ కుట్ర ఉందని సాక్షులు, బాధితులు సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపారు. దీని పై ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలను సిట్ సేకరించింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారంతో బెదిరింపులకు పాల్పడి, ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు సేకరించారన్న ఆరోపణలకు సంబంధించి ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇచ్చిన వాంగ్మూలం ఈ కేసులో అ త్యంత కీలకంగా మారిందని సమాచారం. ఈ క్రమంలో తుది ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ రెడీ అవుతుందని తెలిసింది. ఇందుకోసం సి ట్ అధికారులు న్యాయనిపుణుల సలహాలు కూడా తీసుకున్నారని తెలిసింది. ఇందులో కెసిఆర్‌ను ప్రధాన సూత్రధారిగా పేర్కొంటూ, మావోయి స్టుల పేరిట నంబర్లకు అనుమతిచ్చిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఈ వ్యవహారంలో సహకరించిన ప్రైవేటు వ్యక్తుల పేర్లను కూడా ఛార్జిషీట్ లో చేర్చనున్నట్లు సమాచారం.

కొత్త కొత్వాల్‌కు సవాల్‌గా మారనున్న సిట్ విచారణ

ఇదిలావుండగా ఫోన్ ట్యాపింగ్‌ను సంబంధించిన విచారణను ఇప్పటి వరకు ముగ్గురు పోలీసు కమిషనర్లు పర్యవేక్షించగా తాజాగా ఈ జాబి లాలో నాలుగవ కమిషనర్‌గా మహేష్ భగవత్ చేరారు. ఫోన్ ట్యాపింగ్ ఉదంతం వెలుగు చూసిన సమయంలో కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి కమిష నర్‌గా వుండగా ఆ తరువాత ఆనంద్ వచ్చారు. అనంతరం సజ్జనార్ ఈ కేసును ఏడాదికి పైగా పర్యవేక్షించారు. ఆయన బదిలీ అవడంతో ఈ కేసు విచారణను నూతన కమిషనర్ మహేష్ భగవత్ చూడనున్నారు. ఈ కేసుపై తుది ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ సన్నద్ధమవుతుండడ ంతో ఈ మొత్తం వ్యవహారాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది.

రాహుల్‌కు రేవంత్ బాడీగార్డా?

>> ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు. కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

నేడు సోనియాగాంధీ పుస్తకావిష్కరణలో పాల్గొననున్న సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: ప్రధాని మోదీతో సమావేశం తర్వాత కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పలుకార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సోమవారం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకం 'బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అనంతరం ప్రముఖ లాయర్ సిద్ధార్థ లూథ్రా కుమారుడి వివాహ రిసెప్షన్‌లో కూడా పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతల తోనూ సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఛత్తీస్‌గఢ్ సిఎంతో రేపు భేటీ

>> కోట్లు, చిన్న కాళేశ్వరానికి రూ.178 కోట్లు, చనాకా-కొరాటకు రూ.103 కోట్లు నిధులు అందించాలని విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్రాలకు రూ.2 లక్షల కోట్ల మేర 50 ఏళ్ల వడ్డీలేని రుణాలను కేంద్రం ప్రకటించినా మూలధన సాయం పథకం కింద తెలంగాణకు ఇప్పటివరకు రూ.1,457 కోట్లు అందాయ న్నారు. 70నుంచి 90% పూర్తయిన ప్రాజె క్టుల తుది పనులకు అదనంగా రూ.5,000 కోట్లు కోరామన్నారు. నిధులు అందితే 2027 మార్చి 31లోగా వినియోగిస్తామని,ఏడాదిలో కొత్త ఆయకట్టుకు నీరందిస్తామని ఉత్తమ్ వివరించారు.ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాభావం, పడిపోతున్న భూగర్భ జలమట్టాలపై ప్రధానికి వివరించామమని పేర్కొన్నారు. కేంద్ర భూగర్భ జల మండలి సెప్టెంబర్ నివేదికను ప్రధానికి అందించామని పేర్కొన్నారు. అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు స్వల్ప, దీర్ఘకాలిక కార్యాచరణ,భూగర్భ జలాల పెంపు, పరిరక్షణకు రూ.5,000 కోట్ల ప్రత్యేక కేంద్ర సాయం కోరామన్నారు. వచ్చే వానాకాలం వరకు తాగునీటికి సరిపడా నిల్వలు రిజర్వాయర్లలో ఉంచామని తెలిపామన్నారు. ఈ యాసంగిలో వరి సాగు చేయవద్దని రైతులకు మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ విజ్ఞప్తులను పరిశీలిస్తామని ప్రధాని సానుకూలంగా స్పందించారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ దెబ్బతిందని, ఇప్పుడు అక్కడ ఎత్తిపోతలు చేపట్టాలనడం అర్థరహితమన్నారు. ప్రాణహిత-చేవెళ్లకు రూ.11 వేల కోట్లు వెచ్చించి, 30 శాతం పనుల తర్వాత మేడిగడ్డకు మళ్లించారరని, కమిషన్ల కోసమే ప్రాజెక్టును మేడిగడ్డకు మళ్లించారని గత ప్రభుత్వంపై ఉత్తమ్ ఆరోపణ చేశారు. దిగువన దేవాదుల, సీతారామ పథకాల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నామని పేర్కొన్నారు.



మహారాష్ట్రను ఒప్పించండి

>> అవసరమైన పరిహారం ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణ సాగు నీటి అవసరాల దృష్ట్యా తుమ్మిడిహెట్టికి మహారాష్ట్రను ఒప్పించాలని ప్రధానమంత్రి మోదీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుతో తెలంగాణలోని వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగు నీటి అవసరాలకు గ్రావిటీ ద్వారా నీటిని వినియోగించుకునే అవకాశం కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి మోదీకి తెలియజేశారు. డాక్టర్ ఎస్.జైపాల్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్)లపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా వ్యయం చేసినా పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో తాగు నీటి ప్రయోజనాలు అందడం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పర్యావరణ అనుమతుల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇచ్చినందున ఏమాత్రం ఆలస్యం లేకుండా పర్యావరణ, ఇతర అనుమతులు ఇచ్చేలా చూడాలని పీఎం మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సాస్కీ (స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్లు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 70 నుంచి 90 శాతం మేర పూర్తయిన ప్రాజెక్టులకు ఈ నిధులు వినియోగించుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ నిధులు మంజూరు చేస్తే కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరించిన ఆయకట్టుకు సాగు నీరు సరఫరా చేసేందుకు వీలవుతుందని తెలిపారు. ఫలితంగా రైతుల ఆదాయం, గ్రామీణ ఉపాధి అవకాశాలు, ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) సమర్పించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ ప్రాజెక్టుతో ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూమి, గ్రామాల వివరాలను అంచనాకు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్), బ్యాక్ వాటర్ స్థాయి గుర్తింపుతో కూడిన సమగ్ర సర్వేకు రూ.9.88 కోట్లు చెల్లించిన విషయాన్ని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఛత్తీస్‌గఢ్‌కు భూ పరిహారం చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఆ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) త్వరగా జారీ అయ్యేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) కింద ఇంటిగ్రేటెడ్ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుసీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోడికుంట వాగుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకాకొరాటా బ్యారేజీకి రూ.103 కోట్లు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో డిసెంబరు నెలలో నిర్వహించనున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్- 2026' ప్రారంభ, ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను పీఎంకు సీఎం అందజేసి, గేమ్స్ లోగో, మస్కట్‌ల గురించి వివరించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 7,000 మందికి పైగా అత్యుత్తమ యువ క్రీడాకారులు పాల్గొననున్నారని, భవిష్యత్తులో ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు వారికి ఇదొక చక్కని వేదిక కానుందని సీఎం ప్రధానమంత్రికి తెలియజేశారు. 2002లో జాతీయ క్రీడలు, 2007లో ప్రపంచ మిలిటరీ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన చరిత్ర తెలంగాణకు ఉందని పీఎంకు సీఎం తెలిపారు.

జోరు తగ్గిన గోదావరి

>> ఆదివారం దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు.ఇసుక బస్తాలతో నీటి నిల్వ మట్టాన్ని పెంచేందుకు చేపడుతున్న పనులను పరిశీలించారు.ఇప్పటివరకు పూర్తయిన మూడు లేయర్లు, మిగిలిన రెండు లేయర్ల పనులు, నీటి లీకేజీ నివారణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గడంతో గోదావరిలో నీటి ప్రవాహాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు.సాధారణంగా జనవరి, ఫిబ్రవరి వరకు ఉండే నీటి ఇన్‌ఫ్లోలు కూడా తగ్గిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.ఈ నేపథ్యంలో గోదావరి జలాలపై ఆధారపడిన జిల్లాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇప్పటికే మూడు లేయర్ల ఇసుక బస్తాల పనులు పూర్తయ్యాయని, మరో రెండు లేయర్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ ఏర్పాట్ల ద్వారా 1.2 మీటర్లకు పైగా నీటిమట్టాన్ని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని,తద్వారా మూడు నుంచి నాలుగు నెలల పాటు తాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. అశ్వాపురం నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా మూడు జిల్లాలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉన్నందున దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు.ఇసుక బస్తాల నుంచి నీరు లీకేజీ కాకుండా ప్రత్యేక రక్షణ షీట్లు ఏర్పాటు చేయాలని,పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు.సీతమ్మసాగర్ ప్రాజెక్టు పూర్తయితే దుమ్ముగూడెం వద్ద సుమారు 36 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు.దీనివల్ల 350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్ తదితర జిల్లాలకు గోదావరి జలాలను సరఫరా చేసేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు.ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి,రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొన్నారు.సమ్మక్క సారక్క బ్యారేజీ వద్ద అదనంగా మూడు నుంచి నాలుగు టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన అనుమతుల కోసం పొరుగు రాష్ట్రాలతో చర్చలు జరపాలని సూచించినట్లు వెల్లడించారు.ఆనకట్ట వద్ద నీటి ప్రవాహం పెరిగి ఇసుక బస్తాలకు నష్టం కలగకుండా పవర్‌హౌస్ ద్వారా నీటిని విడుదల చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

నీటి నిల్వకు అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు గేట్లు,పవర్‌హౌస్‌ను మూసివేసి నీటిని నిల్వ చేయాలని, వరద ప్రవాహం పెరిగినప్పుడు ఇసుక బస్తాలకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.గత పది రోజులుగా ఇరిగేషన్ శాఖ అధికారులు శ్రమించి మూడు లేయర్ల పనులను పూర్తి చేయడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు.మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని,సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షి ంచాలని ఆదేశించారు.గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సమర్థవంతంగా వినియోగించుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ పర్యటనలో అమ్మగారిపల్లి సర్పంచ్ కవిత,ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మహేశ్వరరావు, ఈఈ రాంబాబు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆదివారం న్యూఢిల్లీలో బిర్సా ముండా 151వ జయంతి ఉత్సవాల్లో కళాకారుల నృత్యాన్ని వీక్షిస్తున్న రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోడీ

మావోయిస్టులతో ఆదివాసీలకే నష్టం!

>> హింస వల్ల బాల్యం దెబ్బతిన్న పిల్లలకు ఇప్పుడు విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఆయన తెలిపారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా, ఆదివారం మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించిన 'జనజాతీయ గౌరవ్ దివస్' కార్యక్రమంలో ప్రధాని మోడీ వర్చువల్‌గా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన వర్గాల సభ్యులతో ప్రధాని మోడీ వర్చువల్‌గా మాట్లాడారు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను ప్రధాని మోడీతో పంచుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా తమ జీవితాల్లో వచ్చిన మార్పులను వివరించారు.హైదరాబాద్‌కు చెందిన సబావత్ అన్వేష్ అనే విద్యార్థి కూడా ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీతో మాట్లాడారు. పిఎం శ్రీ స్కూల్స్ కార్యక్రమాన్ని తీసుకురావడం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యలో ముందుకు వెళ్లేందుకు అవకాశాలు పెరుగుతున్నాయని ప్రధాని తెలిపారు. పిఎం శ్రీ అంటే ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం. ఈ పథకం విద్యా రంగంలో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తోంది.గత 12-13 యేళ్లలో దాదాపు 50 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని, ఇది స్వాతంత్రం వచ్చిన తర్వాత భారతదేశం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటి అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంక్ నివేదికను ఉటంకిస్తూ, సమాజం, పౌరుల సమిష్టి కృషి వల్లనే ఈ విజయం సాధ్యమైందని, ఇందులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా కీలక పాత్ర పోషించాయని ఆయన వివరించారు.

గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు, ప్రాథమిక సౌకర్యాలకు దూరంగా ఉన్న ఆ ప్రాంతాల కోసం కేంద్ర ప్రభుత్వం 'పిఎం-జన్మన్' (పిఎం-జెఎఎన్ఎంఎఎన్) పథకం మరియు 'ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్' కింద రూ. 1 లక్ష కోట్లకు పైగా నిధులను కేటాయించిందని ప్రధాని తెలిపారు. ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ, పేద కుటుంబాలకు నాలుగు కోట్లకు పైగా పక్కా గృహాలను అందించడం, స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచినా విద్యుత్ సౌకర్యం లేని 18,000 గ్రామాలకు విద్యుత్ సదుపాయాన్ని కల్పించడం, 'ఆయుష్మాన్ భారత్' పథకం ద్వారా ప్రజలకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సను అందించడం వంటి చర్యలు చేపట్టిందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా 1.75 లక్షలకు పైగా 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లను ఏర్పాటు చేయడం ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాలకు కూడా ఆరోగ్య సేవలను విస్తరించామని ఆయన తెలిపారు. పేద కుటుంబాలకు జీవనోపాధి అవకాశాలను కల్పించేందుకు, 'ముద్రా' పథకం కింద ఎటువంటి పూచీకత్తు అవసరం లేని రుణాలను ప్రభుత్వం అందించిందని ఆయన గుర్తు చేశారు.

100కు పైగా ఆకాంక్షాత్మక జిల్లాలు, 500కు పైగా ఆకాంక్షాత్మక బ్లాకులలో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, వీటిలో అనేక ప్రాంతాల్లో గిరిజన జనాభా గణనీయంగా ఉందని మోడీ చెప్పారు. వ్యవసాయ రంగంలో వెనుకబడిన 100 జిల్లాలపై 'ప్రధాన మంత్రి ధన్‌ధాన్య



విద్యుత్ షార్ట్ సర్క్యూట్
ఐదు బస్సులు దగ్ధం

దుండిగల్, నవంబరు 15 ప్రభాతవార్త: దుండిగల్ సర్కిల్ బౌరంపేట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిఖిలలు ఎగిసి పడిన ధాటికి ఐదు ప్రైవేట్‌బస్సులు దగ్ధమయ్యాయి. సమీపంలో పెట్రోల్‌బంక్ ఉండటంతో మంటలను అదుపుచేయడం కోసం స్థానికులు, ఫైర్ ఇంజన్ల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బౌరంపేట్ గ్రామ బొండ్రాయి సమీపంలో సరితా గ్యారేజ్‌లో శనివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. దీనితో మంటలు ఎగిసిపడటంతో పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లోకి వ్యాపించాయి. గ్యారేజ్‌లో ఉన్న ఐదు ప్రైవేట్‌బస్సులు అగిఖిలలకు ఆహుతయ్యాయి. రాత్రివేళలలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీమంటలు వ్యాపించాయి. సకాలంలో స్పందించిన అగ్నివ రాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్ల ద్వారా మంటలను అదుపులోకి తెచ్చేందుకు విశ్వ పయత్నం చేశారు. సమాచారమందుకున్న దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈఘటనలో అస్థినష్టం ఏమేరకు జరిగిందనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

మరో ఇ సిగరెట్ల వ్యాపారి అరెస్టు

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని మీర్‌చౌక్‌లో నిషిద్ధ ఈ సిగరెట్ల వ్యాపారి రాహిల్ ఖాన్ (26)ను ఈగల్ పోలీసు లు ఆదివాం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి 15 వేల రూపాయల విలువచేసే 19 ఇ సిగరెట్లను జప్తు చేశారు. ఇతనిపై బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఇదివరకు ఇదే తరహా కేసు వుందని తేలింది. ఇతను కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు ఈ సిగరెట్లను కొంటు న్నట్లు వెల్లడయ్యింది. గతంలో పాతబస్తీలో ఫుట్‌పాత్‌పై బట్టలు అమ్మిన ఇతను అందులో లాభాలు లేకపో వడంతో ఈ సిగరెట్ల వ్యాపారంలో దిగి దండిగా సంపాదించాడు. తెలం గాణలో వరుసగా అరెస్టవుతున్న ఇ సిగరెట్ల స్మగ్లర్లకు ఇతనికి లింకులున్నట్లు ఈగల్ పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించారు.

విగ్రహాల ఏర్పాటు, డిజెలు,డ్రోన్ల వినియోగంపై
నిబంధనలు విధించిన నిజామాబాద్ కమిషనర్

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: విగ్రహాల ఏర్పాటుతో పాటు డిజెల వినియోగం, డ్రోన్ల వినియోగంపై నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య నిబంధనలు విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. విగ్రహాల ఏర్పాటులో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్లు, ప్రభుత్వ భవనాలు వద్ద ఎలాంటి విగ్రహాలను ఏర్పాటు చేయరాదని ఆయన తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తీసుకోవాలని ఆయ న కోరారు. దీంతో పాటు శబ్ద కాలుష్యం నియంత్రణకు అందరు సహకరించాలని, అధిక శబ్దంతో డి.జెలను ఏర్పాటు చేయరాదని దీనివల్ల ధీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. ఊరేగింపులు, సభల నిర్వహణల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం వుండరాదని ఆయన ఆదేశించారు. దీనికి సంబంధించి లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుండి ముందుగా అనుమతి తీసుకోవాలని, డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమా దాలు పొంచి ఉన్న నేపద్యంలో ముందుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు మరియు ఏవియేషన్ అధికారుల నుండి అనుమతులు తీసుకోవాలని ఆ యన తెలిపారు. దీంతో పాటు నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు సంబంధించిన సమాచారాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు పోలీసులకు తెలపాలని సిపి కోరారు.



తనిష్క్ దోపిడీలో యూట్యూబర్ ప్రియుడు
నిశాంత్, తండ్రి సురేష్‌ల అరెస్టు

మదురై, నవంబరు 15: తమిళనాడులోని మదురై లో ఇటీవల కొత్తగా ప్రారం భమైన తనిష్క్ జ్యువెలరీ షోరూమ్‌లో జరిగిన భారీ దోపిడీ కేసులో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రముఖ యూట్యూబర్, ఇన్ఫ్లూయెన్సర్ మీనాక్షినాచియార్ తో పాటు ప్రధాన నిందితుడు నిషాంత్ తండ్రి సురేశ్‌నుపోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు మదకుళం చెరువు సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గోనె సంచుల్లో పాతిపెట్టిన సుమారు 5 నుంచి 6 కిలోల బంగారు, వజ్రాభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, యూట్యూబర్ నిషాంత్ కోసం 9 ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మదురై బైపాస్ రోడ్డులోని పలంగనాథం వద్ద కొత్తగా తెరిచిన తనిష్క్ షోరూమ్లో నవంబర్ 12 తెల్లవారుజామున ఈ భారీ దోపిడీ జరిగింది. సుమారు 10 కిలోల బంగారం, ఒక కిలో వజ్రాభరణాలు మొత్తం విలువ దాదాపు రూ. 25 నుంచి రూ. 31 కోట్ల వరకు ఉంటుందని అంచనావేసినవి చోరీకి గురయ్యాయి. ప్రధాన నిందితుడు నిషాంత్ దోపిడీకి ముందు మూడుసార్లు కస్టమర్ వేషంలో షోరూమ్కు వచ్చి రెక్కీ నిర్వహించినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. షోరూమ్‌కు ఇంకా పూర్తిస్థాయి లాకర్ సదుపాయం లేకపోవడం, రాత్రివేళ యాంటీబర్గులరీ అలారం ఆన్ చేయకపోవడాన్ని ఆసరాగా చేసుకుని నిషాంత్ భవనం వెనుక ఉన్న స్కాఫోల్డింగ్ సాయంతో టెర్రస్ మీదుగా లిఫ్ట్ షాఫ్ట్ ద్వారా లోపలికి ప్రవేశించి నగలు ఎత్తుకెళ్లాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తన స్నేహితురాలు మీనాక్షి కోసమే నిషాంత్ ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. చోరీ తర్వాత కొంత బంగారాన్ని మదకుళం సమీపంలోని పొలంలో పాతిపెట్టి, మరికొంత బంగారంతో నిషాంత్ పరారయ్యాడు. దోపిడీ సమయంలో ధరించిన దుస్తులను తగలబెట్టి సా లను మాయం చేయడంలో నిషాంత్ తండ్రి సురేశ్ సహకరించినట్లు పోలీసులు తెలిపారు. ఆటోరిక్షా ప్రయాణం, పశువుల కాపరి ఇచ్చిన సమాచారం, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు మీనా , సురేశ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరినీ కోర్టులో హాజరుపరచగా, నవంబర్ 29 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నిషాంత్ చివరి లొకేషన్ తిరుప్పూర్లో ట్రేస్ అయిందని, అతడిని పట్టుకుంటే మిగిలిన నగలు కూడా రికవరీ అవుతాయని మదురై పోలీస్ కమిషనర్ ఎస్. రాజేంద్రన్ తెలిపారు.

కెసిఆర్‌తో ఆదిలాబాద్ యువనేత భార్గవ్ దేశ్‌పాండే భేటీ

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త:బీఆర్ఎస్‌లో ఇటీవల చేరిన ఆదిలా బాద్‌కు చెందిన యువనేత భార్గవ్ దేశ్‌పాండే ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని ఈ సందర్భంగా భార్గవ్ దేశ్‌పాండేకు కేసీఆర్ పిలుపునిచ్చారు. కాం గ్రెస్ పాలనలో తెలంగాణకు నష్టం జరుగుతోందని పేర్కొంటూ, ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తాలని సూచించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని కేసీఆర్ ఆకాంక్షి ంచారు.

సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి

తెలంగాణను ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం

తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు విద్యారంగంలో గేమ్ ఛేంజర్లు: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల కుటుంబ, సామాజిక పరిస్థితులపై అవగా హన కల్పిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావా లని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు నిచ్చారు. విద్య ద్వారానే సామాజిక పరివర్తన సాధ్యమని, తెలంగాణ యువతను ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్ యమని స్పష్టం చేశారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని ఇంజనీరింగ్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌టీఎఫ్) రాష్ట్ర విద్యా మహాసభలను భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్య త్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.విద్యార్థుల ఎదుగుదల కేవలం పాఠశాల బోధనపైనే ఆధారపడి ఉండదని, ఇంటి వాతా వరణం, పౌష్టికాహారం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, సామాజిక నేపథ్యం కూడా వారి మేధో వికాసాన్ని ప్రభా వితం చేస్తాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సహాయ సహకారాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యగతంలో ఎస్‌టీఎఫ్ ఆవిర్భావానికి కూడా ఇదే సామాజిక దృక్పథం పునాదిగా నిలిచిందని భట్టి గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశే ఖర్‌రెడ్డి హయాంలో ఉపాధ్యాయులు విద్యార్థుల కుటుం బాలకు, సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలనే ఆశ యంతో ఈ సంఘం ఏర్పాటైందన్నారు.ప్రజా ప్రభుత్వం



ఆదివారం విద్యమహాసభలో ప్రసంగిస్తున్న డి.సిఎం భట్టి

అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. వేలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో పాటు సుమారు 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, 30 నుంచి 35 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టామని వివరించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తే వారు మరింత సంతృప్తితో విద్యాబోధనపై దృష్టి సారిస్తారనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోం దన్నారు.ప్రభుత్వ విద్యారంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే లక్ష్ యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని భట్టి తెలిపారు. ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలకు ఒకేసారి అనుమతులు మంజూరు చేశామని, ప్రతి శాసనసభ నియోజకవర్గంలో కనీసం ఒక పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. చిన్నతనం నుంచే సమానత్వ భావన పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు కుటుంబ వ్యవస్థలోని అనుబంధాలు, విలువలు కొనసాగాలనే ఉద్దేశంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. సెమీ రెసిడెన్షియల్ విధానంలో దాదాపు 100 పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.విద్యార్థులను ఉదయం ప్రభుత్వ రవాణా సదుపాయంతో పాఠశాలలకు తీసుకురావడంతో పాటు యూనిఫాం, బూట్లు, టై, పుస్తకాలు, బ్యాగులు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించి, సాయంత్రం క్రీడలు, ఇతర కార్యక్రమాల అనంతరం తిరిగి ఇళ్లకు పంపిస్తామన్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులతో సమయం గడుపుతూ కుటుంబ అనుబంధాలు, సామాజిక విలువలు నేర్చుకునే అవకాశం ఉంటుందని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నామని భట్టి తెలిపారు. ఇందుకోసం పరిశుభ్రమైన కేంద్ర వంటశాలలను ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ వివిధన్నమైన అల్పాహారంతో పాటు పాలు, ప్రత్యామ్నాయ రోజుల్లో రాగి జావ అందిస్తున్నామని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులు ఇంటికి వెళ్లిన తర్వాత ప్రశాంతంగా చదువుకునేందుకు అనువైన వాతావరణం ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని భట్టి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేద కుటుంబాలకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని, ఇప్పటివరకు 8 లక్షల ఇళ్లకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు.

సాగుకు అద్దె యంత్రాలు

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: రాష్ట్రంలోని రైతులకు సాగు ఖర్చులు తగ్గించడంతోపాటు, ఆధునిక వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకురావ డానికి తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు పంటల సాగుకు అవసరమైన యంత్రాలు, పరికరాలను రైతాంగానికి అందుబాటులోకి తీసుకురా నుంది. గ్రామస్థాయిలోనే తక్కువ అద్దెకు వ్యవసాయ యంత్రాలను అందించేలా కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని రైతు ఉత్పత్తి దారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు), మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన ఉత్పత్తిదారులు, పరపతి, మహిళా సంఘాల నుండి దరఖాస్తులను ఆహ్వానించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లకు గాను వ్యవసాయ

గ్రామ స్థాయిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు
తక్కువ ధరల్లో యాంత్రీకరణ సౌకర్యం
రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలు
కేంద్ర, రాష్ట్రాలు 60:40 శాతం నిధులు

పనులకు కూలీల కొరత ఉండటంతో రైతులు యంత్రా లపై ఆధారపడుతున్నారు. పంటల సాగులో ముఖ్యంగా పురుగుమందుల పిచికారీకి డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. అయితే వీటి అద్దెలు చిన్న, సన్నకారు రైతులకు భారంగా మారుతున్నాయి. ఒక రైతు తన పొలంలో పిచికారీ కోసం డ్రోన్‌ను వినియోగించడానికి ప్రస్తుతం గంటకు రూ.4 వేలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో సన్న, చిన్న కారు రైతులకు ఇది తలకు మించిన భారంగా తయారయింది. ఇలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గ్రామస్థాయిలోనే డ్రోన్లు, ఇతర వ్యవసాయ పరికరాలను అద్దెకు అందించాలని నిర్ణయించింది. కాగా కేంద్రం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద కస్టమ్ హైరింగ్ సెంటర్లకు అవసరమైన యంత్ర పరికరాలను కొనుగోలు చేసేందుకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఇందుకు గాను కేంద్రం 60 శాతం నిధులు ఇస్తుండగా, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుంది. ఎంపికైన సంఘాలు యంత్రాలను కొనుగోలు చేసిన తర్వాత మొత్తం వ్యయం లో 40శాతం సబ్సిడీగా అందిస్తారు. ఈ రాయితీ గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు ఉంటుంది. కనీసం మూడేళ్ల క్రితం ఏర్పాటై, అప్పటి నుంచి నిరంతరాయంగా పనిచేస్తున్న ఎఫ్‌పీఓలు, పీఏసీఎస్‌లు, మహిళా సంఘాలు దరఖాస్తు చేసుకోవచ్చు. వీటికి సొంత భవనాలు ఉండటం తప్పనిసరి. అర్హతలను పరిశీలించిన తర్వాత ప్రభుత్వం కేంద్రాలను మంజూరు చేస్తుంది. ఎంపికైన సంఘాలకు యంత్రాల నిర్వహణ, అద్దెల నిర్ణయం, మరమ్మతులపై వ్యవసాయశాఖ శిక్షణ ఇవ్వనుంది.

ఈ కేంద్రాల పనితీరును జిల్లా కలెక్టర్ ఆధ్వ ర్యంలోని కమిటీ పర్యవేక్షి స్తుంది. రైతులకు అందించే యంత్రాల అద్దె ధరలను కూడా ఈ కమిటీయే నిర్ణయి స్తుంది. దీంతో అధిక అద్దెలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే చిన్న, సన్నకారు రైతులకు ఖరీదైన యంత్రాలు తక్కువ ధరలకు అద్దెకు అందుబాటులో రానున్నాయి.

మీటరు రీడింగ్‌లో అక్రమాలు

బైపాస్ చేసి నిల్ బిల్లుగా నమోదు
200 యూనిట్లలోపు వచ్చేలా ట్యాంపరింగ్

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్లీ ఇంటెలిజెన్సీ అమలు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అక్రమాలు మాత్రం అరికట్టలేకపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాం తాల్లో విద్యుత్ మీటర్ రీడింగ్‌లో అక్రమాలు జరుగుతున్నట్లు తెలియవచ్చింది. మీటరును బైపాస్ చేసి విద్యుత్ వినియోగాన్ని నిల్ బిల్లులుగా నమోదు చేస్తూ సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. మీటరుకు సీల్ వేసినప్పటికీ, తిరిగి మీటరును బైపాస్ చేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే వివిధ ప్రాంతాల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు కోసం ట్యాంపరింగ్ చేసే వారి సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. నిల్ బిల్ కోసం 200 యూనిట్లు దాటిన కూడా కొంతమంది అంతకంటే తక్కువ యూనిట్లను నమోదు చేయిస్తున్నారు. కాగా మీటర్‌కు ముందు అమర్చిన కిట్‌క్యాట్ ఫ్యూజ్/కట్‌అవుట్‌ను తొలగించి, బయటకు వెళ్లే సరఫరాను నేరుగా మరొక మీటర్ యొక్క ఇన్‌కమింగ్ టెర్మినల్‌కు మళ్లించడం ద్వారా, కన్స్యూమర్ కనెక్షన్ కోసం ఉద్దేశించిన మీటరింగ్ పరికరాన్ని బైపాస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వినియోగదారులతో కుమ్మక్కై ఇటువంటి అక్రమాలకు కొందరు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ అక్రమ వ్యవహారాలు కొందరు అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వదలివేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదు చేయకుండా, నిల్ బిల్లులు జారీ చేస్తూ సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారంటూ అధికారులకు ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. ఈ విధంగానే ఇటీవల విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు వచ్చినట్లు చెబుతున్నారు. సుమారు ఎనిమిది నెలల క్రితం ఒక వినియోగదారునికి కమర్షియల్ విద్యుత్ సర్వీస్ మంజూరైంది. అయితే, వినియోగదారుడు సరైన మీటర్ కనెక్షన్ లేకుండా నేరుగా విద్యుత్‌ను వినియోగిస్తున్న విషయం తెలిసినప్పటికీ అసలు రీడింగ్‌ను నమోదు చేయ కుండా ఉద్దేశపూర్వకంగా నిరక్ష ్యం వహిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మీటర్ రీడర్ ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని నివేదించ కుండా ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వరుసగా నాలుగు నెలల పాటు నిల్ కన్జంప్షన్ బిల్లులను జారీ చేశారని ఫిర్యాదులో ఆరోపించారు.

6 లక్షలకు చేరుకున్న ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తులు

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: రంగారెడ్డి, హైదరాబాద్, మహా బూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలకు ఎమ్మెల్సీల ఎన్నిక ప్రక్రియ ఊపందుకుంది. రెండు నెలల క్రితం ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మొన్నటి వరకు 2.5 లక్షలుగా ఉన్న దరఖాస్తులు రెండు వారాల్లోనే 6 లక్షలకు చేరుకున్నాయి. కాగా ఎన్నికల అధికారులు దీనిపై ముమ్మరంగా ప్రచారం చేశారు. మరికొన్ని రోజుల్లో తుది జాబితా విడదల అవ్వనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెల్సీ పదవికాలం మార్చి 29, 2027న ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనుంది. తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 30న ముద్రిస్తారు. ఎన్నికల షెడ్యూల్‌ను జనవరి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో మూడు ఉమ్మడి జిల్లాల్లో అంటే ప్రస్తుత 9 జిల్లాల్లో 156 మండలాల నుంచి 5 లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇప్పుడు ఓటర్ల జాబితాలో అదనంగా లక్ష నుంచి రెండు లక్షల మంది చేరే సూచనలు ఉన్నాయని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఓటరు నమోదు దరఖాస్తులపై నిఘాను పెం చారు. 6 లక్షల దరఖాస్తుల్లో ఇప్పటి వరకు కేవలం 2,57,309 దరఖాస్తులు మాత్రమే ఆమోదించారు. 6,330 దరఖాస్తులు తిరస్కరించగా, 3.35 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

పంట రుణాలపై ఎల్ నినో ప్రభావం

బ్యాంకుల్లో పెరుగుతున్న నిరర్థక ఆస్తులు
ఒక్క నెలలోనే 4.27 నుండి 4.59 శాతానికి పెరుగుదల
రాష్ట్రంలో వ్యవసాయ రుణాలు రూ.2,00,167 కోట్లు
వీటిలో నిరర్థకంగా రూ.7,304 కోట్ల రుణాలు
వాతావరణ సంక్షోభంతో 18 నుండి 22 శాతం పెరిగే ఛాన్స్

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: తెలం గాణలో వ్యవసాయ పంట రుణాలకు సం బంధించిన మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు) ఆందోళన కలిగిస్తున్నాయి. సూపర్ ఎల్ నినోతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట రుణాల రికవరీ రేట్లు 40 నుండి 50 శాతానికి పడిపోపోవడంతో మొండి బకాయిలు 18 నుండి 22 శాతానికి పెరిగే అవకాశం ఉందని బ్యాంకులు అంచనా వేస్తున్నాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రైతులకు ఇచ్చిన పంట, వ్యవసాయ రుణాలు నిర్ణీత సమయంలో అసలు లేదా వడ్డీ తిరిగి చెల్లించబడనప్పుడు, ఆ రుణ ఆస్తులను వ్యవసాయ నిరర్థక (వ్యవసాయ నాన్‌పెర్ఫార్మింగ్ ఆస్తులు (ఎన్‌పిఎ)) అంటారు. తెలంగాణలో రైతాంగానికి ఇచ్చిన వ్యవసాయ రుణాలలో, ముఖ్యంగా స్వల్పకాలిక పంట రుణాలు, వ్యవసాయ టర్మ్ లోన్లలో పెరుగుతున్న నిరర్థక ఆస్తులు పెరుగుతున్నట్లు బ్యాంకర్ల కమిటీ డేటా వెల్లడిస్తోంది. దీని ప్రకారం ఈ ఏడాది జూన్‌లో 4.27 శాతం ఉన్న స్వల్పకాలిక పంట రుణ బకాయిలు సెప్టెంబర్ నెలాఖరు నాటికి, 4.59 శాతానికి పెరిగాయి. ఇదే కాలంలో వ్యవసాయ టర్మ్ రుణాలలో ఎన్‌పిఎ నిష్పత్తి కూడా 1.73 శాతం నుండి 2.75 శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని బ్యాంకుల్లో 62.61 లక్షల రైతుల ఖాతాల్లో స్వల్పకాలిక పంట రుణాలు రూ. 91,879.91 కోట్ల బకాయి ఉన్నాయి. వీటిలో 4.87 లక్షల ఖాతాల్లో రూ.4,213.99 కోట్ల మేర నిరర్థక ఆస్తులు ఉన్నట్లు బ్యాంకులు తేల్చా యి. వ్యవసాయ టర్మ్ లోన్లలో, 21.95 లక్షల ఖాతాలలో బకాయి ఉన్న అడ్వాన్సులు రూ. 64,078.23 కోట్లుగా ఉండగా, 1.35 లక్షల ఖాతాలలో నిరర్థక ఆస్తులు రూ.1,759.53 కోట్లుగా ఉన్నాయి. అయితే, వ్యవసాయ రుణాలలో మొత్తం నిరర్థక ఆస్తులు (ఎన్పిఎలు) ఈ ఏడాది జూన్‌లో 4.17 శాతం నుండి సెప్టెం బర్ చివరి నాటికి 3.65 శాతానికి తగ్గాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం వ్యవసాయ రుణాలు రూ.2,00,167 కోట్లుగా ఉండగా, వీటిలో రూ.7,304 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి. వ్యవసాయ మోలిక సదుపాయాల రంగంలో నిరర్థక ఆస్తులు ఇదే కాలానికి 5.64 శాతం నుండి 3.28 శాతానికి తగ్గాయి. అదే సమయం లో, అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలలో అవి 7.59 శాతం నుండి 2.99 శాతానికి తగ్గుదల చోటు చేసుకుంది. మొత్తం వ్యవసాయ నిరర్థక ఆస్తులు మెరుగుపడినప్పటికీ, పంట మరియు దీర్ఘకాలిక రుణాల విభాగాలలో క్షీణతతో ఈ గణాంకాలు మిశ్రమ ధోరణిని సూచిస్తున్నాయి. ఇక దేశ వ్యాప్తంగా వ్యవసాయ నిరర్థక ఆస్తులు రెట్టింపు అయ్యాయి. ఈ ఏడాది సూపర్ ఎల్ నినో వీటిని 18 నుండి 22 శాతానికి పెంచుతాయని రిజర్వ్ బ్యాంక్ అంచనా వేసింది. 2025 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ వ్యవసాయ రుణ పోర్ట్‌ఫోలియో రూ.28.98 లక్షల కోట్లుగా ఉంది. తీవ్రమైన కరువు పరిస్థితులలో వ్యవసాయ నిరర్థక ఆస్తులు చారిత్రాత్మకంగా సుమారు 7 శాతం నుండి 14-16 శాతం మేర రెట్టింపు అవుతాయని భావి స్తోంది.

ఈ పరిస్థితుల్లో రుణమాఫీ అమలు కోసం రాజకీయ ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. వివిధ రాష్ట్రాల్లో గత దశాబ్దంలో బ్యాంకుల

వార్త

స్వార్థం కోసమే జీవించే వ్యక్తి, తన మరణం ద్వారా ప్రపంచానికి లాభాన్ని చేకూరుస్తాడు.

న- టెర్ముల్లియన్

సంఘటిత భరోసా!

అసంఘటిత కార్మికుల కోసం ఎవరెవరు ఎన్ని పోరాటాలు చేసినా సంపూర్ణ స్థాయిలోవారికి మేలు చేకూర్చిన ఉదంతాలు కనపడేవి కావు. వారికంటూ ఓ నిర్దిష్ట మైన జీవనం, సంపాదన సృష్టించడంలో ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాలేదు. గిగ్ వర్కర్స్‌ను సంఘటితపరిచి వారికంటూ ఓ గౌరవ ప్రదమైన జీవితం, తగినంత సంపాదన కలిగించే దిశగా ఎన్నో ఆలోచనలు చేస్తున్నా సాకారం కావడం లేదు. అయినా తెలంగాణ ప్రభుత్వం తన పట్టు విడువలేదు. తాజాగా గిగ్ వర్కర్ల సంక్షేమం సామాజిక భద్రత కోసం ప్రత్యేక పాలిసీని రూపొందించి వారికే అంకితమిచ్చింది. ఆధునిక నగర జీవన శైలిలో 'గిగ్ ఎకానమీ' విడదీయరాని భాగంగా మారింది. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రినిద్రపోయేవరకు దైనందిన జీవితంలో ప్రతి మనిషికి దైనందిన జీవితంలో ఉరుకులు పరుగులు తప్పడం లేదు. ఆహారం, నిత్యావసర వస్తువులు ఇంటి గుమ్మం వరకు వచ్చే వెసులుబాటు కోసం ప్రతి ఒక్కరు ఎదురుచూస్తున్నారు. గత పదేళ్లుగా 'గిగ్' వర్క్‌ర్ల సేవాక్రమంలో ఎన్నో మార్పులు వచ్చేశాయి. బయటకు కదిలే పరిస్థితి రాకుండా ఇంటి వద్దకే తెచ్చుకోగలిగే ఏర్పాటు ప్రత్యేకం. అందుకే గిగ్‌వర్కర్‌లు లేకుండా ఏపాటి పనీ ముందుకు నడవడం లేదు. నిజానికి అసంఘటిత కార్మికుల కన్నా భిన్నంగా గిగ్‌వర్కర్ల పని తీరు ఉంటుంది. దీనివల్ల నిరుద్యోగిత తగ్గడమే కాదు మరింత మందికి జీవనాధారాన్ని కల్పిస్తుంది. ప్రతి అవసరాన్ని క్షణాల్లో తీర్చగలిగే డెలివరీ భాగస్వాములు, క్యాబ్, ఆటో డ్రైవర్లు ఇందులోకే వస్తారు. వినియోగదారుల ముంగిటకు సౌకర్యాలను చేరవేస్తున్న శ్రామికుల దైనందిన జీవనాధారం అభద్రత, అస్థిరతతో డోలాయమానంలో ఉంది. ఇదే నేపథ్యంలో గిగ్ ప్లాట్‌ఫారమ్ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విధానానికి శనివారం అంకురార్పణ జరిగింది. సాధారణ కార్మికులకు ఉండే కనీస హక్కులు కూడా వీరికి దక్కడం లేదు. నిజానికి 'యాప్' ఆధారిత సంస్థలు వీరిని భాగస్వాములుగా చెప్తున్నా వారు కార్మిక సేవల్లోనే భాగస్వాములని ఆనక కానీ గుర్తెరగడం లేదు. వర్కర్స్‌గా వారి నిరంతర సేవల్లో కష్టనష్టాలను సమీక్షించి వారికి ప్రయోజనం చేకూర్చే ఎలాంటి ఆలోచనా ప్రభుత్వాల వద్ద లేదనే చెప్పాలి. కొంతలో కొంతమెరుగు తెలంగాణ ప్రభుత్వం వారికోసం ఒక ప్రత్యేక పాలసీ తెచ్చింది. ఎండ, వాన, చలిని లెక్క చేయకుండా ముఖ్యంగా పది నిమిషాల్లో గమ్యస్థానానికి చేర్చాలనే కఠిన లక్ష్యాలను సాధించడం కష్టసాధ్యమే. ఈ లక్ష్య సాధనలో కొందరు ట్రాఫిక్‌లో చిక్కుకుని గమ్యాన్ని ఆలస్యంగా చేరడం వలన జరిమానాల విధింపుతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోవడం, మరికొందరైతే లక్ష్యసాధనలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. రోడ్డు ప్రమాదాల్లో కూడా చిక్కుకుంటున్నారు. వీరికి ఏదైనా ప్రమాదం జరిగితే ఆదుకునేవారుండరు. వారు పనిచేసే 'యాప్'కంపెనీకి వర్కర్లకు మధ్య యజమాని, కార్మికుడనే బలమైన బంధమేమీ ఉండదు. దాంతో ప్రమాదం బారిన పడినవారు తమ వైద్య ఖర్చులకోసం అప్పుల పాలవుతున్నారు. పనికి తగిన వేతనం లేకపోగా, ఇంధన ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కమిషన్లు పెంచకపోవడంతో వారు కుంగుబాటుకు లోనవుతున్నారు. కొందరయితే తమను 'యాప్'సంస్థలు ఎలాంటి ముందస్తుహెచ్చరికలు లేకుండా తొలగించడం కూడా తమ ఆర్థికపరిస్థితిపై ప్రభావంచూపిస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీరెవరికీ సామాజిక భద్రత ఉండనే ఉండదు. ప్రొవిడెంట్ ఫండ్, కార్మికభీమా, అనారోగ్య సెలవులు ఉండనే ఉండవు. మహిళా కార్మికులకు ప్రసూతి సదుపాయాలు మృగ్యమే. వీటన్నిటిరీత్యా 'గిగ్' వర్కర్లు దేశవ్యాప్తంగా ఆందోళన పథాన్ని చేపట్టిన విషయం విదితమే. తెల్లారి లేస్తే ఏ ఉద్యోగికైనా 'గిగ్' వర్కర్ల సేవల్లేనిదే ఇల్లునడవదని అందరికీ తెలిసిందే. 'గిగ్' వర్కర్ల హక్కుల పరిరక్షణ కోసంప్రభుత్వం కార్మిక ప్రతినిధులు, ఆగ్రిగేటర్ సంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక సంక్షేమబోర్డును ఏర్పాటుచేసి తెలంగాణ ప్రభుత్వం ఆ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపింది. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుంది. తెలంగాణ ప్రభుత్వపరంగా ప్రతి 'గిగ్' వర్కర్‌కు రూ.10లక్షల ఆరోగ్యబీమా, రూ.5లక్షలమేరకు ప్రమాద బీమా కల్పిస్తోంది. వైఫైతో అనుసంధానించి బీమా, పించన్, సామాజిక భద్రత కల్పిస్తామని ప్రభుత్వం తరపున తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీ ఆవిష్కరణ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేత భరోసా ప్రకటించారు. ప్రమాదాలు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు భీమా, భరోసాకలిగి ఉండే విధంగా నిబంధనలు రూపొందించడం విశేషం. దేశవ్యాప్తంగా ఉన్న 1.2కోట్ల మంది గిగ్ వర్కర్స్ ఎంతోకాలంగా వారి సమస్యలను ప్రభుత్వాలకు నివేదిస్తోంది. ఇన్నాళ్లకు తెలంగాణ ప్లాట్‌ఫారమ్ బెస్ట్ గిగ్‌వర్కర్స్ పాలసీని ఆవిష్కరించింది. ఇదివారికి పూర్తిసంక్షేమ, సామాజిక, ఆర్థిక భద్రత కలిగించే అంశాలతో నిండి ఉంది. తెలంగాణలో కనీసం 6లక్షల మంది వర్కర్స్ ఇదే జీవనాధారంగా కాలం వెళ్ల బుచ్చుతున్నారు. తాజా విధివిధానాల కల్పనలోవేతనాల లెక్కింపు, పనికేటాయింపు రేటింగ్‌వ్యవస్థలపై కంపెనీలో పారదర్శకంగా సమాచారం ఇవ్వాలని చట్టంలో ప్రతిపాదించారు. తగిన కారణాలు లేకుండా కనీసం 7 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించడంపై నిషేధం విధించారు. ఏదైనా అన్యాయం జరిగితే మూడంచెల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. శ్రమజీవుల కష్టానికి గౌరవం, భద్రతకల్పించినప్పుడే ఆ వ్యవస్థ సకలసౌభాగ్యాలు దరిచేరతాయి.

దేశ విద్యుత్ భద్రతకు భరోసా ఏదీ?

2030 నాటికి 500 గిగావాట్ల నాన్‌ఫాసిల్ సామర్థ్యాన్ని సాధించడం ముఖ్యమైన మైలురాయే అయినప్పటికీ, దానిని మాత్రమే విజయానికి కొలమానంగా పరిగణించలేం. ఉత్పత్తి చేసిన స్వచ్ఛమైన విద్యుత్‌లో ఎంత భాగం వినియోగదారులకు చేరుతోంది, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని ఎంతవరకు తగ్గించగలుగుతున్నాం, విద్యుత్ సరఫరాలో ఎంత విశ్వసనీయత సాధిస్తున్నాం అన్నదే అసలు పరీక్ష. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని వేగంగా విస్తరించగలమని భారత్ నిరూపించింది. ఇప్పుడు ఆ సామర్థ్యాన్ని దేశ ఇంధన భద్రతకు, ఆర్థికాభివృద్ధికి తోడ్పడే స్థిరమైన వ్యవస్థగా మలచుకోవాలి. ఎంత విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నది మాత్రమే కాదు, దానిని ఎంత సమర్థంగా నిల్వచేసి, అవసరమైన చోటుకు చేరవేసి, ప్రజలకు నిరంతరంగా అందించగలుగుతున్నామన్నదే భారత ఇంధన పరివర్తన విజయానికి అసలైన కొలమానం.

డి. జయరాం

ఇంధన రంగంలో స్వావలంబన సాధించాలంటే విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ఒక్కటే సరిపోదు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను నిల్వ చేయడం, అవసరమైన ప్రాంతాలకు తరలించడం, నిరంతరాయంగా వినియోగదారులకు అందించడం కూడా అంతే ముఖ్యం. సౌర, పవన విద్యుత్ రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతి ఆశాజనకమే అయినప్పటికీ, ఆ సామర్థ్యాన్ని విశ్వసనీయ విద్యుత్ సరఫరాగా మార్చగల వ్యవస్థను నిర్మించడమే ఇప్పుడు అసలైన సవాలు. 2026 జూలై 31 నాటికి దేశంలో నాన్‌ఫాసిల్ విద్యుత్ స్థాపిత సామర్థ్యం 300.50 గిగావాట్లకు చేరింది. ఇది మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 54 శాతానికి పైగా. ఇందులో సౌర విద్యుత్ వాటా 164.59 గిగావాట్లు కాగా,పవన విద్యుత్ సామర్థ్యం 58.14 గిగావాట్లు. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్‌ఫాసిల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 శాతం నాన్‌ఫాసిల్ వనరుల నుంచి సాధించాలన్న అంతర్జాతీయ లక్ష్యాన్ని ముందుగానే చేరుకోవడం గణనీయమైన విజయమే. అయితే స్థాపిత సామర్థ్యం పెరగడానికీ, వాస్తవ విద్యుత్ ఉత్పత్తికీ మధ్య వ్యత్యాసాన్ని విస్మరించకూడదు. సౌర విద్యుత్ ఉత్పత్తి పగటి వేళలకే పరిమితం కాగా, పవన విద్యుత్ వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. విద్యుత్ అవసరం మాత్రం నిరంతరం కొనసాగుతుంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పుడు డిమాండ్‌ను తీర్చడం సవాలుగా మారుతుంది. ఈ అంతరాన్ని అధిగమించేందుకు బ్యాటరీ ఆధారిత నిల్వ వ్యవస్థలు, పంప్డ్ స్టోరేజ్ జలవిద్యుత్ ప్రాజెక్టులు కీలకం. కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ రూపొందించిన 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ అనుసంధాన ప్రణాళికలో 47గిగావాట్లబ్యాటరీ నిల్వ సామర్థం, 31 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ సామర్థ్యాన్ని ప్రతిపాదించింది. అయితే ప్రణాళికలు కార్యరూపం దాల్చడంలో జాప్యం జరిగితే పెరుగుతున్న ఉత్పత్తి సామర్థ్యం ఆశించిన ప్రయోజనాన్ని అందించలేదు. విద్యుత్ నిల్వతో పాటు ప్రసార వ్యవస్థ బలోపేతం కూడా అత్యవసరం.సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలు ప్రధాన వినియోగ కేంద్రాలకు దూరంగా ఉండటంతో, తగిన ప్రసార మార్గాలు లేకపోతే ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను వినియోగించుకోవడం సాధ్యం కాదు. 2026 జనవరి-మార్చి మధ్య ప్రసార వ్యవస్థ పరిమితుల కారణంగా సుమారు 300 గిగావాట్ గంటల పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించుకోలేక పోయినట్లు ఎంబర్ అధ్యయనం వెల్లడించింది. అదేకాలంలో మొత్తం విద్యుత్ నిలిపివేత సుమారు 470 గిగావాట్ గంటలుగా అంచనా వేసింది. ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి చూపుతున్న వేగం ప్రసార మౌలిక సదుపాయాల అభివృద్ధిలోనూ కనిపించాలి. లేకపోతే పెట్టుబడులు పెట్టి నిర్మించిన విద్యుత్ కేంద్రాలే పూర్తిస్థాయిలో ఉపయోగపడని పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు, బొగ్గు ఆధారిత విద్యుత్‌పై దేశం కొనసాగిస్తున్న ఆధారపడటాన్ని కూడా వాస్తవికంగాచూడాలి. పునరుత్పాదక ఇంధన సామర్థ్యం పెరుగుతున్నప్పటికీ,



నిరంతర విద్యుత్ సరఫరాలో బొగ్గు కేంద్రాల పాత్ర ఇంకా కీలకమే. తగినంతనిల్వ సామర్థ్యం, ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలు అభివృద్ధి చెందకముందే సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించడం ఇంధన భద్రతకు ముప్పు కలిగించవచ్చు. అందువల్ల శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని దశలవారీగా తగ్గిస్తూ, స్వచ్ఛమైన విద్యుత్ వాటాను పెంచే సమతుల్య విధానం అవసరం. థర్మల్ విద్యుత్ కేంద్రాలను కూడా మారుతున్న గ్రిడ్ అవసరాలకు అనుగుణంగా ఆధునికీకరించాలి. ఈ పరివర్తనలో ఆర్థిక, పారిశ్రామిక సవాళ్లను విస్మరించలేం. భూసేకరణ, పెట్టుబడుల సమీకరణ, అనుమతుల్లో జాప్యం ప్రాజెక్టుల అమలును ప్రభావితం చేస్తున్నాయి. సౌర ఫలకాలు, బ్యాటరీలు, కీలక ఖనిజాల కోసం విదేశీ సరఫరా వ్యవస్థలపై ఆధారపడటం మరో సమస్య. దేశీయ తయారీ, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలు, బ్యాటరీల పునర్వినియోగానికి ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా ఈ ఆధారపడటాన్ని తగ్గించాలి. పునరుత్పాదక ఇంధన ప్రయోజనాలు సామాన్య ప్రజలకు కూడా అందాలి. గృహాల పైకప్పులపై సౌర విద్యుత్ పరికరాలు, వ్యవసాయ పంపులకు సౌర విద్యుత్ అనుసంధానం, గ్రామీణ ప్రాంతాల్లో వికేంద్రీకృత విద్యుత్ ఉత్పత్తి విద్యుత్ ఖర్చులను తగ్గించగలవు. అయితే అధిక ప్రారంభ పెట్టుబడి, రుణ సదుపాయాల కొరత చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలకు అడ్డంకిగా మారుతున్నాయి. స్వచ్ఛమైన ఇంధనం సంపన్న వర్గాలకే పరిమితమవకుండా అందరికీ అందుబాటులో ఉండేలా ఆర్థిక సహకారం, సాంకేతిక మద్దతు కల్పించాలి. ఈ సవాళ్ల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరం. విద్యుత్ నిల్వ ప్రాజెక్టులకు పెట్టుబడులు ఆకర్షించడం, ప్రసార వ్యవస్థను ఆధునికీకరించడం, పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, గ్రిడ్ నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టడం ప్రాధాన్యతలుగా ఉండాలి. అదే సమయంలో భూసేకరణ, జలవనరులు, అడవుల పరిరక్షణ విషయంలో పర్యావరణ ప్రమాణాలను విస్మరించకూడదు. భారత్ పునరుత్పాదక ఇంధన ప్రస్థానం ఇకపై విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల సంఖ్యను పెంచే కార్యక్రమంగా మాత్రమే కొనసాగకూడదు. ఉత్పత్తి, నిల్వ, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను సమన్వయపరిచి, ప్రజలకు సరసమైన ధరకు నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం కావాలి. 2030 నాటికి 500గిగావాట్ల నాన్‌ఫాసిల్ సామర్థ్యాన్ని సాధించడం ముఖ్యమైన మైలురాయే అయినప్పటికీ, దానిని మాత్రమే విజయానికి కొలమానంగా పరిగణించలేం. ఉత్పత్తి చేసిన స్వచ్ఛమైన విద్యుత్‌లో ఎంత భాగం వినియోగదారులకు చేరుతోంది, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని ఎంతవరకు తగ్గించగలుగుతున్నాం,విద్యుత్ సరఫరాలో ఎంత విశ్వసనీయత సాధిస్తున్నాం అన్నదే అసలు పరీక్ష. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని వేగంగా విస్తరించగలమని భారత్ నిరూపించింది. ఇప్పుడు ఆ సామర్థ్యాన్ని దేశ ఇంధన భద్రతకు, ఆర్థికాభివృద్ధికి తోడ్పడే స్థిరమైన వ్యవస్థగా మలచుకోవాలి. ఎంత విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నది మాత్రమే కాదు, దానిని ఎంత సమర్థంగా నిల్వచేసి, అవసరమైన చోటుకు చేరవేసి, ప్రజలకు నిరంతరంగా అందించగలుగుతున్నామన్నదే భారత ఇంధన పరివర్తన విజయానికి అసలైన కొలమానం.

ప్రజాస్వామ్య ప్రస్థానంలో ఓటు దారెటు!

జయసూర్య

కోట్లాది భారత జనసామాన్యానికి రాజ్యాంగం ప్రజాస్వామ్యం, హక్కులు, విధులు వంటి ముఖ్యాంశాలు పట్టించుకోవలసిన అవసరం, అగత్యం లేకుండా రాజకీయ పాలన నడుస్తోంది. రాజకీయ పార్టీలు ఓటరుకుఆలోచించి ఓటు వినియోగించుకొనే స్వేచ్ఛలేకుండా ప్రలోభాలు, వాగ్దానాలు, ముడుపులు తాయిలాలు ఎన్నో ఆకర్షణలుసృష్టించి ఉక్కిరిబిక్కిరి చేయడం, నేటి మాట కాదు. ఎన్నికల పండగలోస్తే ఇంట్లో ఉన్న ఓట్లు ఎంత ఎక్కువ ఉంటే అంతగా నోట్లు కురుస్తాయని జనం ఆ రోజు కోసం ఎదురుచూస్తుంటారు. మేధావంతులు, ప్రజాస్వామ్యవాదులు అమ్ముకోవద్దని జనసామాన్యానికి ఎన్ని, ఎంతగా సందేశాలంచిందినా నిష్ప్రయోజనమే. ఎందుకంటే ఓటు వల్ల, ఓటరుకు, తాత్కాలిక లబ్ధి పొందడమే తెలుసుకాని ఓటు స్వేచ్ఛగా వినియోగించుకోవడం వలన భారత ప్రజాస్వామ్యానికి ప్రజలే పాలకులు కావడం కేవలం, అర్థం చేసుకోలేని అయోమయ రాజకీయం నడుస్తోంది. ఓటు విలువ మాట ఎలా ఉన్నా మనదేశంలో ఓటు వినియోగించుకోవడంపై విభిన్న వర్గాలలో, పేద మధ్య సంపన్న కుటుంబాలలో వైరుధ్య భావాలున్నాయి. అసంఖ్యాక నిరుపేదలు తమ కనీస జీవనావసరాలను ఓటు వేయడం ద్వారా సాధ్యమవుతుందని అంతగా ఆశించకపోయినా, రాజకీయ పార్టీల ప్రలోభాలు,ఓటర్లుగా గుర్తింపుతో ఎన్నికలలోపాల్గొంటారు. అధికార వ్యామోహంతో సంపన్న వర్గాలు, ఏ రాజకీయ పార్టీనైనా ఆశ్రయించి, ఎన్నికలలో విజయం సాధించాలనే ప్రయత్నాలలో తలమునకలవుతుంటారు. అధికారంలోకి రావటమే పరమావధిగా ఎన్నో జిమ్మిక్కులు, ఎన్నో చిత్ర విచిత్రాలు తప్పవు. అధికారంలోకి రావటానికి ప్రతిపక్ష పార్టీల నేతలు, అదనుకోసం ఎదురుచూస్తూ వ్యూహాలు పన్నుతుంటారు. సర్వత్రా అవినీతి, అసమర్థత, వాగ్దానాల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనపడుతుంటాయి.పరస్పర నిందారోపణలు, వాగ్యుద్ధాలు, సంకుల సమరాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధికార పార్టీ నేతల కొమ్ముకాసి పబ్బం గడుపుకోవడం, గత ప్రభుత్వ వైఫల్యాలతో ప్రతిపక్ష పార్టీలను నీరుకార్చే ప్రచారాలతో మీడియా విజృంభిస్తుంటుంది. ఓటర్లను తమకు అనుకూలంగా, ఓటు ద్వారా తీర్పు పొందే సంకుల సమరంలో దేశమంతటా ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీలు నిమగ్నమయ్యాయి. భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్. ఐ.ఆర్) కారణంగా ఓటు హక్కు కోల్పోవటం అధిక సాధారణమైంది. విద్యాధిక కుటుంబాలలోనివారు, ఓటు గురించి అంతగా పట్టించుకోరు. అవకాశం,అవసరం ఉంటేనేఓటింగ్ బూత్‌కు వెళ్తారు. ఓటు వల్ల రాబట్టుకొనే తాయిలాల కారణంగా పేద ప్రజలు పార్టీలకు అనుగుణంగా బారులు తీర్తారు. పోలింగ్‌శాతం పెరగడానికి వీరే కారణం.ప్రస్తుతం అధికారం పొందటానికి ప్రతిపక్షాలు, అధికారంలోఎలాగైనా మళ్లీ కొనసాగటానికి రాజకీయ పార్టీల నేతలు ఎన్నో వ్యూహాలు, యుక్తులు చేపడుతున్నారు. ప్రధానంగా మతంపై ఆధారపడి ఓటు వినియోగించుకొనే వారి బలంతీవ్రంగా తగ్గించే ప్రయత్నాలున్నాయి. అదే విధంగా వారి ఓటు బలం కొన్ని పార్టీలు పెంచుకొనే కృషీ ఉంది. నామినేషన్ ప్రక్రియ సందర్భం నుంచి కుయుక్తులు ప్రారంభమై, ఉప సంహరణలు, నామినేషన్‌లు చెల్లకుండా చేయడం ఎన్నో రాజకీయ పార్టీలు అవలంబించే మార్గాలు వెలుగు చూస్తున్నాయి. ఓటు ఉన్నా హక్కు నిర్వీర్యం చేయగల సాధన, సామాగ్రి, సాంకేతికత ప్రజ్ఞ కౌంటింగ్ ప్రక్రియలో తమాషాలున్నాయి. అధికార వ్యామోహం, కుల, మత ఏకత్వం,ధనాధిక్యత, అవినీతి, సమాజాన్ని వేరుపురుగులా తినేస్తుండటంతో భవిష్యత్‌లో ఓటు విలువ పూర్తిగా రూటు మారి కనుమరుగయ్యే దుస్థితి ప్రస్తుతం నెలకొని ఉంది. మేధావంతులు, ఆలోచనాపరులు ఇప్పటికే రాజకీయాలకు దూరం అవుతున్నారు. సిద్ధాంత ప్రాతిపదికపై పాలన ప్రశ్నలేదు. ప్రజాస్వామ్యం ముసుగులో ప్రశ్నించే హక్కు నయానా, భయానా అణచివేయబడుతోంది.అధికార, ప్రతిపక్షాలు, ఎన్నికల రణరంగంలో ఓట్ల ఆధిక్యత సాధించే లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. రాజ్యం పాలించడానికి రాచబాటగా ఓటు, నేటికీ రాజకీయ వ్యవస్థకు అత్యంత కీలకమైనది కావటంతో దేశంలోని రాజకీయపార్టీలురానున్న ఎన్నికల రణరంగంపై ఇప్పటి నుంచి మోహరిస్తున్నాయి. 'ఓటు లిచ్చువారే చేట కొట్టగలరు' అన్నారు వి.ఆర్. నార్ల. కానీ ఓట్లు కొల్లగొట్టడం కంటే, ఓటర్లనే కొల్లగొట్టడం, అనే ప్రక్రియ చాపకింద నీరులా సాగుతోంది. ఎన్నికల కమిషన్ జాతీయ స్థాయిలో రివిజన్ ప్రక్రియ శృతి మించి కోట్లాదిగా ఓట్లు గల్లంతు కావటం ధృవీకరించబడింది. భారతదేశ ప్రజాస్వామ్యం, భారత ప్రజాస్వాతంత్ర్య పరిరక్షణకు, జన జీవన సంక్షేమం సామాజిక న్యాయం, సమానతా విలువలకు ఓటు హక్కు ప్రాణం. కేంద్ర ఎన్నికల కమిషన్‌లు గతంలో ఎన్ని రివిజన్‌లు చేసినా ఇంత గందరగోళం, ఆందోళనలు వివాదాస్పద అంశాలు తలెత్తలేదు. ఇన్ని కోట్ల స్థాయిలో జనం ఓటుహక్కు కోల్పోవడంతో ఎన్నికల కమిషన్‌పై విశ్వాసం సడలి, కాలక్రమేణా భవిష్యత్తు తరాల ప్రస్థానంలో, వ్యవస్థ ముఖ్యంగా రాజకీయ నిర్వీర్యం ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికార పార్టీలు అప్రమత్తంగా వ్యవహరించవలసి ఉంది. ఎన్నికల ప్రహసనం మరింత పతన దిశలో సాగితే, దేశ భవిత అంధకారమయమవుతుంది.

దేశ ఆర్థికాభివృద్ధికి ఏదీ అసలైన చోదకశక్తి?

డి జె మోహన రావు

ప్రజలు ఎక్కువగా ఖర్చు చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందా? లేక ఎక్కువగా పొదుపు చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందా? ఈ రెండింటిలో ఏది దేశానికి మేలు చేస్తుంది? నిజానికి వినియోగం, పొదుపు పరస్పర విరుద్ధమైనవి కావు. ఒకటి వర్తమాన ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తే, మరొకటి భవిష్యత్తు పెట్టుబడులకు పునాది వేస్తుంది. దేశాభివృద్ధికి ఈ రెండింటి మధ్య సమతుల్యతే కీలకం. ప్రజలు ఖర్చు చేసినప్పుడే మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది. ఒక కుటుంబం ద్విచక్ర వాహనం కొనుగోలు చేస్తే ఆ ప్రయోజనం తయారీ సంస్థకే పరిమితం కాదు. విడిభాగాల తయారీదారులు, రవాణా సంస్థలు, డీలర్లు, మరమ్మతు కేంద్రాలకూ ఆదాయం సమకూరుతుంది. ఆ ఆదాయం తిరిగి ఇతర వస్తువులు, సేవల కొనుగోలుకు దారితీస్తుంది. ఇలా ఒకరి ఖర్చు మరొకరికి ఆదాయంగా మారి ఆర్థిక వ్యవస్థలో చలనాన్ని పెంచుతుంది.వినియోగం తగ్గితే పరిశ్రమల ఉత్పత్తి, ఉపాధి కూడా దెబ్బతినవచ్చు. భారత ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు వినియోగం కీలకమైన స్థానం ఆక్రమిస్తోంది. 2024-25లో ప్రైవేటు తుది వినియోగ వ్యయం సుమారు రూ.179.71 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది జీడీపీలో 56.5 శాతం. 2025-26కు సంబంధించిన తాత్కాలిక అంచనాల ప్రకారం ఈ వ్యయం రూ.196.51 లక్షల కోట్లకు చేరింది. అయితే వినియోగం పెరిగిందంటే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని అర్థంకాదు. ఆదాయం కంటే ధరలు వేగంగా పెరిగితే కొనుగోలు శక్తి తగ్గుతుంది. అప్పులపై ఆధారపడిన అధిక వినియోగం కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్నీ దెబ్బతీయవచ్చు. దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెరగకుండా దిగుమతులపై ఆధారపడిన వినియోగం పెరిగితే దాని ప్రయోజనాల్లో కొంత భాగం విదేశీ ఆర్థిక వ్యవస్థలకు చేరుతుంది. మరో వైపు, పొదుపు దేశ భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన పెట్టుబడి వనరులను సమకూరుస్తుంది. ప్రజల పొదుపులు బ్యాంకులు, ఆర్థికసంస్థల ద్వారా పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, మౌలిక సదుపాయాల రంగాలకు చేరినప్పుడు కొత్త ఉత్పత్తి సామర్థ్యం ఏర్పడుతుంది. 2024-25లో భారత స్థూల దేశీయ పొదుపులు సుమారు రూ.111.13 లక్షల కోట్లుగా అంచనా వేయగా, అందులో కుటుంబ రంగం వాటా 62.1 శాతం. అదే ఏడాది స్థూల మూలధన కల్పన జీడీపీలో 34.3 శాతంగా నమోదైంది. అయితే పొదుపులు పెరగడమే అభివృద్ధికి హామీ కాదు. అవి ఎంతవరకు ఉత్పాదక పెట్టుబడులుగా మారుతున్నాయన్నదే ముఖ్యం. ప్రజలందరూ ఒకేసారి ఖర్చులు తగ్గించి పొదుపుకే ప్రాధాన్యం ఇస్తే ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పడిపోవచ్చు. పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించి పెట్టుబడులను వాయిదా వేయవచ్చు.



ఫలితంగా ఉపాధి, ఆదాయాలు కూడా తగ్గుతాయి. వ్యక్తిగతంగా పొదుపు చేయడం మంచిదే అయినా, సమాజమంతా ఒకేసారి వినియోగాన్ని తగ్గిస్తే ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుంది. ఆర్థిక శాస్త్రంలో దీనినే పొదుపు వైరుధ్యంగా పేర్కొంటారు. అభివృద్ధి చెందిన దేశాల అనుభవాలూ ఈ సమతుల్యత ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం 2024లో జీడీపీలో కుటుంబ వినియోగంవాటా అమెరికాలో సుమారు67.9శాతం, భారత్‌లో 56.6 శాతం, జపాన్‌లో 53.1శాతం. ఈ తేడాలు ఆయా దేశాల ఆర్థిక నిర్మాణాన్ని ప్రతిబింబిస్తాయి. వాటి అభివృద్ధికి వినియోగం లేదా పొదుపు ఒక్కటే కారణంకాదు. అధిక ఉత్పాదకత,సాంకేతిక పరిజ్ఞానం,పరిశ్రమలసామర్థ్యం, ఎగుమతులు, మౌలిక సదుపాయాలు కూడా కీలక పాత్ర పోషించాయి. వినియోగం డిమాండ్‌ను సృష్టిస్తే, పెట్టుబడులు ఆ డిమాండ్‌ను తీర్చగల ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మిస్తాయి. భారత కుటుంబాలు బ్యాంకు డిపాజిట్లు, బీమా, పెన్షన్ పథకాలు, మ్యూచువల్ ఫండ్లు, షేర్లతోపాటు బంగారం, భూమి, ఇళ్లలోనూ పొదుపులను పెట్టుబడిగా పెడుతున్నాయి. అయితే ఇప్పటికే ఉన్న బంగారం లేదాభూమిని కొనుగోలు చేయడంవల్ల కొత్త ఉత్పత్తి సామర్థ్యం ఏర్పడదు. అదే నిధులు పరిశ్రమలు, గృహనిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేరితే ఉపాధి, ఉత్పత్తి పెరుగుతాయి. కాబట్టి పొదుపు పరిమాణంతోపాటు అది ఏ రంగానికి చేరుతోందన్నదీ ముఖ్యం. ఆర్‌బీఐ ప్రకారం 2024-25లో కుటుంబ రంగం నికర ఆర్థిక పొదుపులు స్థూల జాతీయ పునర్వినియోగ ఆదాయంలో 7శాతంగా ఉన్నాయి. అంతకు ముంద

కొత్త కమాండర్ ఇన్ ఛీఫ్‌గా రెహ్మాన్ గుల్ అలియాస్ ముఠీద్

క్వెట్టా, నవంబరు 15: పాకిస్తాన్‌పై బలూచ్ లిబరేషన్ ఆర్మీని తిరుగుబాటు చేస్తోంది. పాక్ ప్రభుత్వం తమ ప్రాంతంపై పాల్పడుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోంది. బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి స్వతంత్రం పొందేందుకు పెద్ద ఎత్తున కార్యకలాపాలు సాగిస్తోంది. ఇదిలా ఉంటే, బలూచ్ లిబరేషన్ ఆర్మీ కొత్త కమాండర్‌ఇన్‌చీఫ్‌గా సీనియర్ కమాండర్ రెహ్మాన్ గుల్ అలియాస్ ముఠీద్ నియమితుల య్యారు. గతంలో పాకిస్తాన్ సైన్యంలో కెప్టెన్‌గా పనిచేసిన ఆయన 8 ఏళ్ల సర్వీస్ తర్వాత 2010లో తిరుగుబాటు బీఎల్‌ఏలో చేరారు. ఇప్పటి వరకు బీఎల్‌ఏ ఆర్మీలో కీలక సైనిక విభాగమైన మజీద్ బ్రిగేడ్‌కు నాయకత్వం వహించారు. బీఎల్‌ఏ విడుదల చేసిన ప్రకటనలో సంస్థ సీనియర్ కమాండ్ కౌన్సిల్ సభ్యులు, కమాండర్లతో చర్చించిన తర్వాత రెహ్మాన్ గుల్‌ను కొత్త అధినేతగా ఎంపిక చేశారు. ఈ నియామకం పూర్తిగా ఏకగ్రీవంగా జరిగినట్లు బీఎల్‌ఏ ప్రకటించింది. రెహ్మాన్ గుల్ గతంలో సీనియర్ కమాండ్ కౌన్సిల్ సభ్యుడిగా కూడా పనిచేశారు. సంస్థలో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవం గుల్‌కు ఉందని బీఎల్‌ఏ పేర్కొంది. కొత్త నాయకత్వం తమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తాయని ప్రకటించింది.బీఎల్‌లో ఇటీవల నాయకత్వ మార్పులు చోటుచేసుకున్నాయి. నవంబర్ 3న బషీర్ జెబ్ బలూచ్ ఇకపై కమాండర్‌ఇన్‌చీఫ్ బాధ్యతల్లో ఉండరని బీఎల్‌ఏ ప్రకటించింది. ఇప్పుడు ఈ స్థానంలో రెహ్మాన్ గుల్‌ను తీసుకువచ్చారు. 2018 డిసెంబర్‌లో అస్లాం బలూచ్ మరణం తర్వాత బషీర్ జెబ్ సంస్థ పగ్గాలు చేపట్టారు. ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో అస్లాం బలూచ్ మరణించారు. ఆ తర్వాత బషీర్ జెబ్ నేతృత్వంలోని బీఎల్‌ఏ పాకిస్తాన్ సైన్యం, పోలీసులు, చైనాపాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టులపై విస్తృతమైన దాడులు చేసింది. 2018లో కరాచీలోని చైనా కాన్సులేట్‌పై దాడి, 2019లో గ్వాదర్‌లోని పెర్ల్ కాంటినెంటల్ హోటల్‌పై దాడి, 2020లో కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై దాడి ఉన్నాయి. 2025 మార్చిలో జరిగిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు హైజాకింగ్ ఘటనకు కూడా బీఎల్‌ఏ బాధ్యత ప్రకటించింది. రెహ్మాన్ గుల్ బీఎల్‌ఏలో కీలక కమాండర్‌గా గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సైన్యంలో పనిచేసిన అనుభవం ఉండటంతో పాక్ సైన్యం పనితీరు, ఆపరేషన్స్‌పై అవగాహన ఉంది. దీంతో బీ ఎల్‌ఏకు చెందిన ప్రమాదకర మజీద్ బ్రిగేడ్‌కు నాయ కత్వం వహించి అనేక డెడ్లీ అటాక్స్ నిర్వహించారు. గతంలో పాకిస్తాన్ సైన్యంలో కెప్టెన్ హోదాలో పనిచేశారు. పాక్ సైన్యాన్ని వీడి బీఎల్‌ఏలో 2010లో చేరారు. ఆగస్టు 14 ,1984లో బలూచిస్తాన్‌లోని నౌష్కి ప్రాంతంలో గుల్ జన్మించారు. 2002లో పాకిస్తాన్ సైన్యంలో చేరిన ఆయన 19 ఫ్రంటియర్ ఫోర్స్ రెజిమెంట్‌లో సుమారు ఎనిమిదేళ్ల పని చేశారు. పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ, కాకుల్‌లో రెం డేళ్లపాటు శిక్షణ పొందారు.

విదేశాలకు వెళ్లొస్తే అధికారం రాదు

గ్రామాల్లో పర్యటించి జనం ఘోష వినాలి : రాహుల్ ప్రసంగాలపై అమిత్ షా సెటైర్లు

పూణె,నవంబరు 15: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అంతర్జాతీయ వేదికలపై భారత్, ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. ఇలాంటి విమర్శలతో తిరిగి అధికారంలోకి రావాలన్న ఆయన ఆకాంక్షనెరవేరదని అన్నారు. ఆదివారం పుణెలో నేషనల్ కెమికల్ ఇంజినీరింగ్ కోఆపరేటివ్ పునరుద్ధరణ కార్యక్రమానికి శంకుస్థాపన చేసిన అనంతరం అమిత్ షా మాట్లాడారు. రాహుల్ గాంధీ తిరిగి అధికారంలోకి రావాలని భావిస్తే విదేశీ పర్యటనలు మానుకుని దేశంలోని గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. అప్పుడైనా ఆయనకు అధికారంలోకి వచ్చే అవకాశం ఉండవచ్చని వ్యాఖ్యానించారు. వరుస ఎన్నికల పరాజయాలతో కాంగ్రెస్ పార్టీ అసహనానికి గురై దేశాన్ని, దేశ నాయకత్వాన్ని అంతర్జాతీయ వేదికలపై విమర్శిస్తోందని అమిత్ షా ఆరోపించారు. ఈనెల13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ పై కూడా ఆయన విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం దేశీయ, విదేశీ వామపక్ష భావజాల ప్రతినిధులను ఈ సదస్సుకు ఆహ్వానించిందని అన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న కాంగ్రెస్ యువరాజు అంతర్జాతీయ వేదికపై భారత్‌కు వ్యతిరేకమైన ఆలోచనలను వ్యక్తం చేస్తూ దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో అధికారంలోకి రావడం సాధ్యం కాదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పనితీరుపై ఆ పార్టీ కార్యకర్తలు నాయకత్వాన్ని నిల దీయాలని అమిత్ షా సూచించారు. ప్రస్తుత రాజకీయ వైఖరిని కొనసాగిస్తే మరో 30 ఏళ్ల పాటు కాంగ్రెస్ అధికారానికి దూరంకాక తప్పదని హెచ్చరించారు. ఎన్నికల్లో గెలుపోటములు రాజకీయ పార్టీలు, వాటి నాయకుల పనితీరుపైనే ఆధారపడి ఉంటాయ న్నారు. 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు కాంగ్రెస్‌కు దేశాన్ని పాలించే అవకాశం లభించిందని, ఆ సమయంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. దీంతో ప్రజలు ఆ పార్టీని అధికారానికి దూరం చేసి నరేంద్ర మోదీని ప్రధానమంత్రి పీఠంపై కూర్చో బెట్టారని పేర్కొన్నారు. గత 12 ఏళ్లుగా మోడీ ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తోందని అమిత్ షా అన్నారు. ప్రధానమంత్రిపై చిన్నపాటి అవినీతి ఆరోపణ కూడా రాలేదని పేర్కొన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగం, అంతరిక్ష పరిశోధనలు, స్టార్టప్ వ్యవస్థ, రైల్వేల ఆధునికీకరణ, విమానయాన మౌలిక సదుపాయాలు, విద్యారంగాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన పురోగతిని ఆయన వివరించారు. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరుకోవడం నుంచి స్టార్టప్ వ్యవస్థను అభివృద్ధి చేయడం వరకు, రైల్వేల పునరుద్ధరణ నుంచి విమానాశ్రయాల సంఖ్యను 76 నుంచి 150కి పెంచడం వరకు అనేక కీలక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. అంతర్జాతీయ సమాజం ముందు భారత్ ప్రతిష్ఠ, విశ్వసనీయతను కాపాడే విషయంలో రాజకీయ విభేదాలు అడ్డంకి కాకూడదని అమిత్ షా అన్నారు. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా లేదా మరే రాజకీయ పార్టీ అయినా అంతర్జాతీయ వేదికపై భారత్‌ను, ప్రధానమంత్రిని కించపరచడాన్ని ఎలా సమర్థించగలదని ప్రశ్నించారు. భారత్ అభివృద్ధి ప్రస్థానాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అంతర్జాతీయ సమాజం ముందు తక్కువ చేసి మాపేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు ఓటర్లు ఎన్నికల సమయంలో తగిన సమాధానం చెప్పాలని అన్నారు. రాహుల్ గాంధీ ప్రజల్లోకి వెళ్లి గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అర్థం చేసుకోవాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అమిత్‌షా వ్యాఖ్యానించారు.





ల్యాండింగ్ గేర్ ఫెయిల్‌తో ఇండిగో ఎమర్జెన్సీ లాండింగ్

పూణె, నవంబరు 15: ల్యాండింగ్ గేర్ ఫెయిల్ కావ డంతో గువాహటి కి వెళ్లాల్సిన ఇండిగో విమానం అత్యవసరంగా పుణె ఎయిర్‌పోరు లో ల్యాండ్ అయ్యింది. టేకాఫ్ తర్వాత విమానం ల్యాండింగ్ గేర్ వెనక్కి ముడుచుకోకపోవడంతో పుణెకు తిరిగి వచ్చిం ది. ఫ్లైట్ 6ఇ0623 పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కి సమాచారం అందించడంతో భారత వైమా నిక దళం పుణె ఎయిర్‌పోర్టులో పూర్తిస్థాయి అత్య వసర పరిస్థితిని ప్రకటించింది. ఈ ప్రక్రియలో భాగం గా అగ్నిమాపక దళాలు, అంబులెన్స్‌లు, అత్యవసర ప్రతిస్పందన బృందాలను అత్యంత అప్రమత్తంగా ఉంచారు. 192 మంది ప్రయాణికులు, సిబ్బందితో ఉన్న ఆ విమానం ఉదయం 9:04 గంటలకు సురక్షితంగా ల్యాండయ్యింది. ల్యాండింగ్‌కు ముందు గ్రౌండ్ బృందాలు ల్యాండింగ్ గేర్‌ను ప్రత్యక్షంగా తనిఖీ చేయడానికి వీలుగా రన్‌వేపై తక్కువ ఎత్తులో ప్రయాణించింది. మూడు ఫైర్ ఇంజిన్‌లు, రెండు అంబులెన్స్‌ల సాయంతో ప్రయాణికులు, సిబ్బంది అందరినీ ఏరోబ్రిడ్జ్ ఉపయోగించి బే నంబర్ 7కు సురక్షితంగా తరలించారు. ఈ ప్రక్రియలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఉదయం 9:10 గంటలకు పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని అధికా రికంగా ఉపసంహరించారు.

సోనియా ఆత్మకథ పుస్తకావిష్కరణ సభకు తమిళ సిఎం విజయ్

చెన్నై,నవంబరు 15: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ఢిల్లీలో పర్యటనకు వెళుతున్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆత్మకథ "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" పుస్తకా విష్కరణ కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. ఢిల్లీలోని ఒక ప్రముఖ హోటల్‌లో జరగనున్న ఈ వేడుకలో విజయ్ పాల్గొంటున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మణికం ఠాగూర్ ధ్రువీకరించారు. ఈ కార్యక్రమానికి సోనియా గాంధీ కుటుంబ సభ్యులతో పాటు పలువురు ముఖ్య ఆహ్వానితులు హాజరుకానున్నారు. సోనియా గాంధీతో పాటు రాహుల్ గాంధీ కూడా ముఖ్య మంత్రి విజయ్‌కు ఫోన్ చేసి వ్యక్తిగతంగా ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడిం చాయి. ఈ నేపథ్యంలో విజయ్ ఢిల్లీ పర్యటనకు రాజకీయంగా ప్రాధాన్యత సంతరిం చుకుంది. పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అయినప్పటికీ, ఈ పర్యటనలో ముఖ్యమంత్రి విజయ్ ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశమవుతారా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ భేటీ జరిగితే, కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన మేఘధాతు డ్యాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు వాదనలను ఆయన మరోసారి వినిపించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయవద్దని కోరుతూ నవంబర్ 7న విజయ్ ఇప్పటికే ప్రధానికి లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందంటూ కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత ముదిరింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ ఢిల్లీకి వెళ్లడం ఇది మూడోసారి. గత పర్యటనల్లో ఆయన ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సోనియా గాంధీ వంటి అగ్రనేతలతో భేటీ అయ్యారు.



సంక్షిప్త వార్తలు

మరణశిక్ష తాత్కాలిక నిషేధానికి భారత్ నో

న్యూయార్క్, నవంబరు 15: ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం (యూఎన్ జీఏ) థర్డ్ కమిటీలో మరణశిక్షల అమలుపై ప్రపంచవ్యాప్త తాత్కాలిక నిషేధం విధించా లంటూ ప్రవేశ పెట్టిన ముసాయిదా తీర్మా నానికి వ్యతిరేకంగా భారత్ ఓటు వేసింది. మెక్సికో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి అనుకూలంగా 133 దేశాలు ఓటు వేయగా, భారత్‌తో సహా 33 దేశాలు వ్యతిరేకించాయి. మరో 16 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఐరాసలోని భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ భవిక మంగళానందన్ దేశ వైఖరిని స్పష్టం చేశారు. మరణశిక్షలకు సంబంధించి ప్రపంచ దేశాల మధ్య ఎలాంటి ఏకాభిప్రాయం లేదని ఆమె పేర్కొన్నారు.



మియామి ఎయిర్‌పోర్టులో 2 విమానాలు ఢీ



మియామి, నవంబరు 15: అమెరికాలో విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొన్నది. శుక్ర, శనివారాల్లో విమానాశ్రయాల్లో లక్షలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఈ ఘటనను మరువకముందే శనివారం రాత్రి మియామి అంతర్జాతీయ విమానా శ్రయంలోని టార్మాక్‌పై రెండు విమానాలు ఢీకొన్నాయి. రన్‌వేపై మలుపు తిరుగుతున్న ఒక విమానం రెక్క కొన వెనుకనున్న విమానం ముక్కుకు తగిలింది. శనివారం రాత్రి 9:15 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి.

తొలి విద్యుత్ ప్లేన్ ట్రయల్ రన్ విజయవంతం



బీజింగ్, నవంబరు 15: విమానయాన రంగంలో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. ప్రభుత్వ రంగ సంస్థ కోమాక్ అభివృద్ధి చేసిన పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ వాణిజ్య విమానం సీఈ25ఎ తొలిసారిగా విజయవం తంగా గాల్లోకి ఎగిరింది. షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని బిన్‌జౌ నగరంలో ఈ చరిత్రాత్మక ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ ప్రయోగాత్మక పరీక్షలో ఇద్దరు పైలట్లు, ఒక ఫ్లైట్‌టెస్ట్ ఇంజనీర్ పాలుపంచుకున్నారు. మొత్తం 57 నిమిషాల పాటు సాగిన ఈ ప్రక్రియలో, విమానం 16 నిమిషాలకు పైగా నింగిలో విహరిస్తూ 60.4 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. విమాన పనితీరు సంతృప్తికరంగా ఉందని, అన్ని వ్యవస్థలు నిర్దేశిత లక్ష్యాల మేరకు పనిచేశాయని కోమాక్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

పంజాబ్‌లో రోడ్డు ప్రమాదం : ఐదుగురు మృతి



తరన్‌తరన్, నవంబరు1 5: పంజాబ్‌లో నిన్న ఘోర ప్రమాదం సంభవించింది. తరన్ తారన్ జిల్లాలో యాత్రికులతో వెళ్తున్న రెండు ప్రభుత్వ బస్సులు పరస్పరం ఢీకొన్నాయి. ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. తరన్ తారన్‌లోని నౌషెహ్రా పన్నువాన్ సమీపంలో జాతీయ రహదారి54పై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఫరీద్‌కోట్ నుంచి అమృత్‌సర్ వెళ్తున్న ఒక బస్సు, అకస్మాత్తుగా రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి వైపునకు దూసుకెళ్లింది. ఇదే సమయంలో ఎదురుగా అమృత్‌సర్ నుంచి ముక్త్‌సర్ వస్తున్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది.

ఇజ్రాయెల్ వైమానిక దాడి : అబూయూనిస్ మృతి



గాజాసిటీ, నవంబరు 15: గాజాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య హమాస్ సాయుధ విభాగం అల్‌ఖస్సామ్ బ్రిగేడ్స్ కీలక ప్రకటన చేసింది. దక్షిణ గాజాలో జరిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడిలో తమ రఫా బ్రిగేడ్ కమాండర్ సమీర్ మహ్మూద్ అబూ యూనిస్ మరణించినట్లు నవంబర్ 15న ప్రకటించింది. అబూ యూనిస్ హమాస్‌కు చెందిన జనరల్ మిలిటరీ కౌన్సిల్ సభ్యుడు కూడా అని ఆ సంస్థ పేర్కొంది. ఖాన్ యూనిస్‌లోని అల్‌మవాసి ప్రాంతంలో జరిగిన దాడిలో ఆయన మరణించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఇజ్రాయెల్ సైన్య ఒక ప్రకటన విడుదల చేసింది.

ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం

న్యూఢిల్లీ, నవంబరు 15: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అంతకంతకే పెరుగుతున్నది. గడిచిన వారం రోజుల నుంచి వరుసగా గాలి నాణ్యత క్షీణిస్తున్నది. దాంతో ఢిల్లీ నగరం అంతటా దట్టంగా పొగమంచు కమ్ముకుని ఉంటున్నది. ఈ పొగమంచు కారణంగా దారి కొద్దిదూరం కూడా కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇవాళ ఢిల్లీలో సగటు గాలి నాణ్యత రికార్డు స్థాయిలో 325 కి పడిపోయింది. బారాపుల్లా, జేఎల్‌ఎన్ స్టేడియం ఏరియాల్లో ఎయిర్ క్వాలిటీ బాగా క్షీణించింది. ఢిల్లీ యూనివర్సిటీ ఏరియాలో, పుసా ఏరియాలో, ధిర్‌పూర్ ఏరియాలో గాలి నాణ్యత అత్యంత అధ్వాన్నంగా ఉన్నది. నోయిడాలో కూడా ఎయిర్ పొల్యూషన్ పెరిగిపోయింది.

పునర్విభజనలో 50శాతం పెంచితే మద్దతు పరిశీలిస్తాం

ఎన్సీపీ శరద్‌పవార్ నేత సుప్రియా సూలే



ముంబయి, నవంబరు 15: నియోజ కవర్గాల పునర్విభజన, మహిళా రిజ ర్వేషన్ బిల్లును మరోసారి శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ముందుకు తెచ్చేందుకు నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభు త్వం ప్రయత్నిస్తోంది. గత ఏప్రిల్‌లో బీజేపీ సర్కారు తీసుకొచ్చిన ఈ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన సంగ తి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లుకు మద్దతుపై ఎన్సీపీ (ఎస్పీ) వర్కింగ్ ప్రెసిడెంట్, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాల వారీగా ఎలాంటి మార్పులు చేయకుండా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను సమానంగా 50 శాతం పెంచేలా నిబంధనలు ఉంటే మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో ఎన్సీపీ (ఎస్పీ) భాగస్వామిగా ఉంది. ఎన్సీపీ రెండు వర్గాలు విలీనమవుతాయనే ఊహాగానాల నడుమ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరిం చుకున్నాయి. జులైలో వర్షాకాల సమావేశాలకు కొన్ని రోజుల ముందు కూడా సూలే ఇలాంటి ఫార్ములానే ప్రతిపాదించారు. ఆ బిల్లుకు మద్దతు ఇవ్వాలని తమ పార్టీ నిర్ణయించుకుందంటూ వచ్చి న వార్తలను ఆ తర్వాత ఆమె తోసిపుచ్చారు. ఏప్రిల్‌లో వీగిపోయిన బిల్లులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మౌఖికంగా హామీ ఇచ్చిన 50శాతం పెంపు అంశం పొందుపర చలేదు. డీలి మిటేషన్‌తో ముడిపడి ఉన్న 33 శాతం మహిళా రిజర్వేషన్ల అంశంపై రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ కూడా ప్రభుత్వానికి లేకపోవడం ఆ బిల్లు ఓడిపోవడానికి ఓ కారణం. బిల్లు వీగిపోయిన తర్వాత, జనగణన, డీలిమిటేషన్ అనే నిబంధనను తొలగించి, 2023 చట్టం ప్రకారం ప్రస్తుతం ఉన్న 543 స్థానాల్లోనే 33 శాతం మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని సూలే డిమాండ్ చేశారు. నియోజకవర్గాలు చిన్నవిగా మారితే ఎంపీలు ఓటర్లతో మరింత సన్నిహితంగా ఉండేందుకు వీలు కలుగుతుందని సూలే అన్నారు. తన సొంత నియోజకవర్గమైన బారామతిని ఉదాహరణగా చూపుతూ, ఏళ్ల తరబడి అక్కడ ఓటర్ల సంఖ్య సుమారు 10-12 లక్షల నుంచి దాదాపు 2022 లక్షలకు పెరిగిందని తెలిపారు. దీనివల్ల ఒక ఎంపీ ప్రతి గ్రామాన్ని సందర్శించడం, సమాన అభివృద్ధిని అందించడం ఆచరణాత్మకంగా అసాధ్యంగా మారిందని ఆమె పేర్కొన్నారు. అంత పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉన్నప్పుడు ఏటా ఇచ్చే రూ. 5 కోట్ల ఎంపీ ల్యాడ్స్ నిధులు ఏమాత్రం సరిపోవని, మెరుగైన ప్రాతినిధ్యం, అభివృద్ధి కోసం నియోజకవర్గాలను విభజించడం అనివార్యమని సూలే అభిప్రా యపడ్డారు. ఇక ఎన్సీపీ విలీన చర్చలను సుప్రి యా సూలే తోసిపుచ్చారు. తన సోదరుడు అజిత్ పవార్ మరణంతోనే మా వైపు నుంచి ఈ విషయానికి మేము ఫుల్ స్టాప్ పెట్టాం అని సుప్రియా సూలే తెలిపారు.

ఆందోళనలతో అట్టుడికిన పోర్చుగల్

ఇళ్ల ధరలు, అద్దెల పెంపు పట్ల భారీగా నిరసనలు

లిస్బన్, నవంబరు 15: పోర్చుగల్‌లో విపరీతంగా పెరిగిపోతున్న ఇళ్ల ధరలు, అద్దెలకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం వెల్లువెత్తింది. దేశవ్యాప్తంగా 30కి పైగా నగరాలు, పట్టణాల్లో వేలాదిమంది వీధు ల్లోకి వచ్చి భారీ ప్రదర్శనలు చేపట్టారు. దేశ చరిత్రలోనే నివాస హక్కులకోసం జరిగిన అతిపెద్ద నిరసనగా ఇది నిలిచింది. లిస్బన్, పోర్టో వంటి ప్రధాన నగరాల్లో విద్యార్థులు, యువత నుంచి పదవీ విరమణచేసిన వృద్ధుల వరకు అందరూ రోడ్లపైకి వచ్చారు. మా నివాస హక్కు ను లాక్కోనివ్వం, అద్దెలు తగ్గించండి.. వేతనాలు పెంచండి అంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 2015 నుంచి 2025 మధ్య పోర్చుగల్‌లో సాధారణ ప్రజల ఆదాయంతో పోలిస్తే ఇళ్ల ధరలు ఏకంగా 61 శాతం పెరిగాయి. యూరోపియన్ యూని యన్‌లోనే ఇది అత్యధిక పెరుగుదల కావడం గమనార్హం. కేవలం 2025 తొలి త్రైమాసికం నుంచి 2026 తొలి త్రైమాసికం మధ్యే ఇళ్ల ధరలు దాదాపు 20 శాతం పెరిగాయని జాతీయ గణాంకాల సంస్థ వెల్ల డించింది. 2020 నుంచి ఇప్పటివరకు అద్దెలు 68 శాతం పెరిగినట్లు అధికారిక లెక్కలు చెబు తున్నాయి. విదేశీ కొనుగోలుదారులు, ఇన్వెస్ట్ మెంట్ ఫండ్స్, డిజిటల్ నోమాడ్స్ తాకిడి పెరగ డం, పర్యాటకం కారణంగా ఇళ్లను స్వల్పకాలిక అద్దెలకు ఇవ్వడం వంటి అంశాలు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయి. దీనికితోడు యజ మానులు అద్దెదారులను త్వరగా ఖాళీ చేయించేం దుకు వీలుగా ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన బిల్లు ప్రజల ఆగ్రహాన్ని మరింత పెంచింది. ప్రజల ఆందోళనల నేపథ్యంలో పోర్చుగల్ అధ్యక్షుడు ఆంటోనియో జోస్ సెగురో ఉన్నత స్థాయి మండలితో సమావేశమై చర్చలు జరి పారు. కొందరు నిరసనకారులను కూడా ఆయన స్వయంగా కలిశారు. సంక్షోభాన్ని అదుపు చేసేందుకు కొత్త నిర్మాణాలకు పన్ను రాయితీలు ఇవ్వడంతో పాటు 1.45 క్షల కొత్త ఇళ్లను నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ఈశాన్యంలో భూ ప్రకంపనలు

గువాహతి, నవంబరు 15: ఈశాన్య రాష్ట్రాల్లో భూమి వరుసగా కంపించింది. ఒకదాని తర్వాత ఒకటిగా తగిలిన ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. శనివారం మధ్యాహ్నం అస్సాం రాష్ట్రంలోని కామరూప్ జిల్లాలో ఒక్కసారిగా భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై దీని తీవ్రత 4.0గా నమోదైంది. మధ్యాహ్నం 2:43 గంటల ప్రాంతంలో భూగర్భంలో 10 కిలోమీటర్ల లోతున ఈ ప్రకంపనల కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. ఒక్కసారిగా ఇళ్లలోని సామాగ్రి కిందపడటంతో జనం ప్రాభణాలతో ప్రాణభయంతో రోడ్ల మీదకు పరుగులు తీశారు. అస్సాం ఘటన తాలూకు భయం ఇంకా వీడకముందే, శనివారం రాత్రి 9:28 గంటల సమయంలో అరుణాచల్‌ప్రదేశ్‌లోని కురుంగ్ కుమేయ్ జిల్లాలో మరోసారి భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై దీని తీవ్రత 3.1గా నమోదైంది.

ట్రంప్ గోల్ఫ్ కోర్ట్ విస్తరణ ప్రణాళికలకు కోర్టు బ్రేక్

వాషింగ్టన్, నవంబరు 15: వాషింగ్టన్‌లో చారిత్రాత్మక పబ్లిక్ గోల్ఫ్ కోర్స్‌ను ఆధునీకరించాలన్న డొనాల్డ్ ట్రంప్ ప్రణాళికకు తాత్కాలిక అడ్డంకి ఎదురైంది. నిర్మాణ పనులు ప్రారంభం కావడానికి ముందే అమెరికా కోర్టు స్టే విధించింది. స్థానిక ప్రజలు, పరి రక్షణ సంస్థల న్యాయపోరాటంతో ఈ ప్రాజెక్టు నిలిచి పోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభు త్వానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌కు సుమారు రెండు మైళ్ల దూరంలో ఉన్న చారిత్రాత్మక గోల్ఫ్ కోర్స్‌ను భారీ స్థాయిలో ఆధునీకరించాలన్న ట్రంప్ ప్రణాళికకు అమెరికా న్యాయస్థానం తాత్కాలికంగా బ్రేక్ వేసింది. నిర్మాణ పనులు ప్రారంభం కావడానికి కొద్ది గంటల ముందు కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ గోల్ఫ్ కోర్స్‌ను 15 నెలల పాటు మూసివేసి అభివృద్ధి పనులు చేపట్టాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే స్థానిక ప్రజలు, పర్యావరణ, చారిత్రక ప్రదేశాల పరిరక్షణ సంస్థలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయపోరాటం ప్రారంభించాయి. దీంతో ప్రాజెక్టు పనులు ప్రస్తుతానికి నిలిచిపోయాయి.వాషింగ్టన్‌లోని ఈస్ట్ పొటోమాక్ గోల్ఫ్ లింక్స్ విషయంలో ఈ వివాదం కొనసాగుతోంది. పొట



ఆదివారం హరీష్ ఇంట్లో కార్యక్రమానికి హాజరైన కెసిఆర్, కెటిఆర్, హిమాన్షు

హరీశ్‌రావు ఇంటికి వెళ్లిన కెసిఆర్, కెటిఆర్, హిమాన్షు

హైదరాబాద్,నవంబరు 15,ప్రభాతవార్త: బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇంటికి వెళ్లారు. హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్య నారాయణరావు గతేడాది మరణించగా ఆదివారం సంవత్సరీక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేసీఆర్ పాల్గొన్నారు. తన్నీరు సత్య నారాయణరావు చిత్ర పటానికి పూలమాలవేసి కేసీఆర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా హాజ రయ్యారు. తన కుమారుడు హిమాన్షుతో కలిసి కార్యక్రమంలో పాల్గొని సత్యనారాయణరావుకు నివాళులు అర్పించారు. ఒకేచోట బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు ముఖ్యనేతలు కనిపిం చడంతో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడి యాలో వైరల్ అవుతున్నాయి. హరీశ్‌రావుకు కేసీఆర్‌తో కుటుంబపరంగా కూడా సన్నిహిత సం బంధం ఉంది. హరీశ్‌రావు కేసీఆర్‌కు మేనల్లుడు కావ డంతో కుటుంబ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు.



గోసంరక్షణ సమష్టి బాధ్యత

సంప్రదాయ విజ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించాలి: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

గోవిజ్ఞాన పరీక్షల విజేతలకు పురస్కారాల ప్రదానం

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: గోసంరక్షణ కేవలం మతపరమైన అంశం కాదని, అది సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, పర్యావరణ పరిరక్షణతో ముడిపడిన బాధ్యత అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గోమాతకు అత్యంత పవిత్రమైన స్థానం ఉందని, వేదకాలం నుంచి గోవును మాతృస్వరూపంగా ఆరాధిస్తున్నామని పేర్కొన్నారు . ఆదివారం హైదరాబాద్ నారాయణగూడలోని సర్దార్ పటేల్ ఆడిటోరియంలో సనాతన గో సంపత్తి ఫౌండేషన్, గోసేవ విభాగం తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గోవిజ్ఞాన పరీక్షలు-2026 బహుమతుల ప్రదానోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గోవు వెన్నెముక వంటిదన్నారు. పాలు, పెరుగు, వెన్న, నెయ్యి వంటి ఉత్పత్తులు ప్రజలకు పోషకాహారాన్ని అందించడంతోపాటు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. గోమాత ప్రాధాన్యం పాల ఉత్పత్తులకే పరిమితం కాదని, పేడ, గోమూత్రం సంప్రదాయ వినియోగం సేంద్రియ వ్యవసాయానికి, ప్రకృతి వనరుల పరిరక్షణకు ఉపయోగపడుతుందని వివరించారు. భారతీయ సంప్రదాయంలో గోవును అష్టలక్ష్మి అనుగ్రహం, సిరిసంపదలకు ప్రతీకగా భావిస్తారని తెలి పారు. గోసంరక్షణను ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు గోవిజ్ఞానంతోపాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పశుపోషణ, పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్, గ్రామీణ పారిశ్రామిక రంగాల్లోని అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.
పాఠశాలలు, కళాశాలల్లో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం, పశు సంక్షేమం, గ్రామీణ పారిశ్రామికతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సంప్రదాయ విజ్ఞానాన్ని ఆధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించినప్పుడే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమన్నారు. గోవిజ్ఞాన పరీక్షల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, గోమాత ప్రాధాన్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులను గవర్నర్ అభినందించారు. పురస్కారాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులోనూ జ్ఞానం, అంకితభావం, సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, తెలంగాణ ప్రాంత సంఘచాలక్ బి. సుందర్‌రెడ్డి, అఖిల భారత గోసేవ సంయోజక్ అజిత్ ప్రసాద్ మహాపాత్ర, కార్యక్రమ అధ్యక్షుడు డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చలిలో గిరిజనులకు వెచ్చని భరోసా

500 ఉన్ని దుప్పట్లతో కూడిన వాహనాన్ని ప్రారంభించిన గవర్నర్

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: మారుమూల గిరిజన ప్రాంతాల్లో చలితో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు అభయ ఫౌండేషన్ ముందుకొచ్చింది.నేడు ఆదివాసీ పోరాటయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని నిర్వహించి జనజాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా ఆదివారం లోక్‌భవన్‌లో ప్రాంగణం లో నిర్వహించిన కార్యక్రమంలో ‘అభయ హంట్ ది వింటర్-2026’లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులకు పంపిణీ చేయనున్న 500 ఉన్ని దుప్పట్లతో కూడిన రెడ్ క్రాస్ వాహనాన్ని గవర్నర్ మాననీయ శివప్రతాప్ శుక్లా గారు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. వేసవిలో గొడుగులు, శీతాకాలంలో దుప్పట్లు అందిస్తూ అభయ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే సేవే నిజమైన సేవ అని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, స్వచ్ఛంద కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడాన్ని ప్రశంసించారు. దుప్పటి అందించడం అంటే కేవలం చలి నుంచి రక్షణ కల్పించడం కాదు.. తెలంగాణ మీకు అండగా ఉందనే భరోసా ఇవ్వడం అని అన్నారు. భగవాన్ బిర్సా ముండాకు నిజమైన నివాళిగా యువత గిరిజన గ్రామాలను సందర్శించి, స్వయంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు స్వామి బాలచంద్ర మాట్లాడుతూ.. ఈ ఏడాది దక్షి ణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు మొత్తం 4,000 దుప్పట్లు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి చేరుకున్న గవర్నర్‌కు గిరిజన పోలీసు పరీక్ష శిక్షణా అభ్యర్థులు స్వాగతం పలికారు. స్వామి బాలచంద్ర ఆయనకు ఆహ్వానం పలికారు. అనంతరం అభయ ఫౌండేషన్‌కు చెందిన సూపర్ కాప్స్‌తో గవర్నర్ కరచాలనం చేసి, వారితో ఫొటో దిగారు. అవసరమైన ప్రతి గిరిజన కుటుంబానికీ సహాయక సామగ్రి చేరేలా చూడాలని గవర్నర్ సూచించారు

ఉద్యోగాల కోసం ఎదురు చూడొద్దు

పారిశ్రామికవేత్తలుగా యువత ఎదగాలి, భూములు, రాయితీలు, ప్రోత్సాహకాలు: డి.సిఎం భట్టి

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా పారిశ్రామికవేత్తలుగా ఎద గాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచిం చారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగ అబి వృద్ధికి పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో ఆదివారం జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో మాట్లాడుతూ భూముల కేటాయింపు, రాయి తీలు, ప్రోత్సాహకాలను అర్హులైన పారిశ్రామి కవేత్తలకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పారిశ్రామిక ప్రగతితో పాటు సామా జిక న్యాయం, సమాన అవకాశాలు, సమ్మిళిత ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొ న్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా యువత స్వ యం ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ముందుకు రావాలని చెప్పారు. పరిశ్రమ స్థాపనకు అవ సరమైన పారిశ్రామిక ప్రాంతంలో స్థలాల కేటా యింపునకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందని



ఆదివారం మహేశ్వరం నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డి.సిఎం భట్టి

తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు స్థాపించాలనుకునే యువత ముందుకు రావా లన్నారు. కళాకారులు, మేధావులు, సామాజిక చైతన్యం కోసం పనిచేసే వ్యక్తులను గుర్తించి గౌరవించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం, అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధా న్యత ఇవ్వాలని సూచించారు. ఉన్న చెట్లను తొల గించకుండా ప్రకృతిని కాపాడుతూ పరిశ్రమలను అభివృద్ధి చేయాలన్నారు. పర్యావరణ హిత పారి శ్రామిక ప్రగతి సాధించే దిశగా సంస్థ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

మరో రూ.1,000 కోట్ల రుణం

17న సెక్యూరిటీ బాండ్ల వేలంలో సేకరణ

ఈ ఆర్థికంలో రూ.54,900 కోట్లకు చేరిన అప్పు

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం మరో రూ. 1,000 కోట్ల రుణానికి ఇండెంట్ పెట్టింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఈ నెల 17న నిర్వహించే బహిరంగ ఈ-వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించనుంది. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ సమర్పించింది. దీంతో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది నెలల కాలంలో ఇప్పటివరకు ఆర్బీఐ వేలాల ద్వారా చేసిన అప్పులు రూ.54,900 కోట్లకు చేరనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోని తొలి నెల ఏప్రిల్ 7న రూ.3,900 కోట్లతో ప్రారంభమైన రుణ సమీకరణ, జూలై 1న రూ.7,000 కోట్లు, సెప్టెంబర్ 15న రూ.7,500 కోట్ల చొప్పున సేకరించింది. నవంబర్ 17న మరో రూ.1,000 కోట్లు తీసుకోనున్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌లో వార్షిక రుణ లక్ష్యం రూ.61,457.16 కోట్లుగా సర్కార్ పేర్కొంది. ఇప్పటి వరకూ తీసుకున్న రుణం వార్షిక అంచనా లక్ష్యంలో 89.33 శాతంగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్ నుండి జూన్ నెల వరకూ తొలి క్వార్టర్‌లో రూ.18,900 కోట్లు, జూలై నుండి సెప్టెంబరు నెల వరకూ కలిగిన రెండో త్రైమాసికంలో రూ.27,500 కోట్లు చొప్పున మొత్తం రూ.46,400 కోట్ల రుణ సమీకరణ చేసింది. ఈ మొత్తం అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న వార్షిక రుణ లక్ష్యంలో దాదాపు 80 శాతం మేరకు తీసుకున్నట్లయింది. అక్టోబరు నుండి డిసెంబరు వరకూ కలిగిన మూడో క్వార్టర్ లో రూ.13 వేల కోట్ల మేర రుణం సేకరించనున్నట్లు ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాలరాసిన చరిత్ర కాంగ్రెస్‌ది

ఎమ్మెల్సీ ఎన్నికల వరకు చురుగ్గా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలి: పార్టీ శ్రేణులతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమావేశం

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త: నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ బీజేపీ అన్ని విభాగాల (ఆల్ సెల్స్) సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పార్టీ నిర్మాణంలో వివిధ సెల్స్ (విభాగాలు) అత్యంత కీలకమైనవని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సెల్స్ పనితీరుకు ఎంతో ప్రాధా న్యతనిస్తారని తెలిపారు. బీజేపీలో జాతీయ స్థాయిలో 22 అధికారిక సెల్స్ ఉన్నాయని, రాష్ట్ర స్థాయిలో అవసరాన్ని బట్టి మరో ఐదారు సెల్స్‌ను ఏర్పాటు చేసు కునే అవకాశం ఉందని వివరించారు. ఎక్స్ సర్వీస్‌మెన్, అడ్వకేట్స్, ట్రేడర్స్, ఐటీ, సోషల్ మీడియా, టీచర్స్, ఎడ్యుకేషన్, డాక్టర్స్, కల్చరల్ సెల్ వంటి విభాగాల ద్వారా సమాజంలోని వివిధ వృత్తి నిపుణులను, మేధావులను పార్టీతో అనుసంధానించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో ఇతర ఆఫీస్ బేరర్స్‌కు ఉన్నంత ప్రాముఖ్యత సెల్స్ కన్వీనర్లకు కూడా ఉంటుందని, తాను కూడా గతంలో లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బి.ఎల్. సంతోష్ సూచనల మేరకు అన్ని సెల్స్ సభ్యులు ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. యుద్ధంలో చేతులు, కాళ్లు లేని సైనికుడు కూడా దేశభక్తి గీతాలతో సైన్యంలో ఉత్సాహం నింపినట్లు, సికిందర్ సినిమాలోని డాల్ డాల్ పర్ సోనే కి చిడియా గీతం స్ఫూర్తితో కల్చరల్ సెల్ సహా అన్ని విభాగాలు ప్రజల్లో జాతీయవాద చైతన్యం నింపాలని కోరారు. హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ‘భారత్ సమ్మిట్’పై రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పెట్టుబడుల సదస్సు పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిగ్ వర్కర్లు ఎవరూ కనిపించలేదని, కేవలం కాంగ్రెస్ కార్యకర్తలను మాత్రమే తీసుకువచ్చారని విమర్శించారు.

భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవ హారాల్లో విదేశీయులు జోక్యం చేసుకోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇటలీ నుంచి వచ్చిన ఒక ప్రతినిధి ఓట్ చోర్, గద్దీ చోర్ అంటూ భారత ప్రజాస్వామ్యంపై వ్యాఖ్యలు చేయడం మన దేశ సార్వ భౌమాధికారాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. అమెరికా వంటి దేశాల్లో విదేశీయులు అక్కడి అంతర్గత రాజకీయాలపై మాట్లాడితే ఎట్టిపరిస్థితుల్లో అనుమతించరని, అలాంటిది రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి భారతదేశాన్ని డెడ్ ఎకానమీ అని అవమానించడమే కాకుండా, ఇప్పుడు విదేశీయులను భారత గడ్డపైకి పిలిపించి మన దేశానికి వ్యతిరేకంగా మాట్లాడించడం ముమ్మాటికీ దేశద్రోహ చర్య అని ఆరోపించారు. మీరు మోదీని వ్యతిరేకిస్తే ప్రజాస్వామ్యంలో సహిస్తాం కానీ, భారతదేశాన్ని వ్యతిరేకిస్తే ఎట్టిపరిస్థితుల్లో సహించ బోము” అని



ఆదివారం హైదరాబాద్‌లో బిజెపి శ్రేణులతో సమావేశమై మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

రాంచందర్ రావు స్పష్టం చేశారు.
ఈ సదస్సుకు 350 మంది విదేశీ ప్రతినిధులు రావాల్సి ఉండగా, కేవలం 115 మంది మాత్రమే హాజరయ్యారని, భారత వ్యతిరేక వ్యాసాలు రాసిన నార్వే జర్నలిస్టు హెల్లె లింగ్ సహా మిగిలిన వారికి కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో వీసాలు రద్దు చేయడం ముమ్మాటికీ సరైన నిర్ణయమని రాంచందర్‌రావు సమర్థించారు. గతంలో నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు అమెరికా వీసా నిరాకరించాలని 63 మంది కాంగ్రెస్ ఎంపీలు సంతకాలు చేసి అమెరికా అధ్యక్షుడికి లేఖ రాసిన విషయాన్ని శశిథరూర్, కాంగ్రెస్ నేతలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా జాతీయవాద ప్రభుత్వాలను కూల్చివేస్తానని బహిరంగంగా ప్రకటించిన జార్జ్ సోరోస్ నిధులతో నడిచే ప్రోగ్రెసివ్ అలయన్స్, ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థల ప్రతినిధులను ఈ సమ్మిట్‌కు రప్పించారని ఆరోపించారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్యాట్రిక్ గాస్పర్డ్ (ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్ మాజీ అధ్యక్షుడు), గిలౌమ్ లాంగ్ (ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి), నికా కోవాచ్ (స్లోవేనియాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ 8 మార్చి వ్యవస్థాపకురాలు సోరోస్ సంస్థల నుంచి నిధులు పొందినవారు), బెర్ట్ కోయెండర్స్ (డచ్ మాజీ విదేశాంగ మంత్రి) వంటి వారంతా జార్జ్ సోరోస్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నవారేనని ఆధారాలతో సహా వివరించారు.

రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా ఎం. దాన కిషోర్ ఏకగ్రీవ ఎన్నిక

హైదరాబాద్,నవంబరు15,ప్రభాతవార్త:ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.లోక్ భవన్‌లో జరిగిన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యులు ఎం. దాన కిషోర్‌ను రాష్ట్ర శాఖ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఎం. దాన కిషోర్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా నామినేట్ చేయగా, మేనేజింగ్ కమిటీ ఈ నామినేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది.

చైర్మన్ ఎన్నికతో పాటు యూత్ రెడ్ క్రాస్ కమిటీ, జూనియర్ రెడ్ క్రాస్ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఫైనాన్స్ కమిటీ, నషా ముక్త్ భారత్ కమిటీ, విపత్తుల నిర్వహణ (డిజాస్టర్ రెస్పాన్స్) కమిటీలకు కూడా రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంది. ఈ సందర్భంగా అంతకుముందు వివిధ జిల్లాల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్లు, చైర్‌పర్సన్లు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ఘనంగా సత్కరించారు.

నూతనంగా ఎన్నికైన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు, జిల్లా చైర్మన్లు, చైర్‌పర్సన్లను గవర్నర్ అభినందించారు.

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో అఖిల భారత పోలీసు బ్యాండ్ మేళం పోటీలు

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: నగర శివార్లలోని హకీంపేట్‌లో గల సిఆర్‌పిఎఫ్ సెంటర్ లో సోమవారం నాడు అఖిల భారత పోలీసు బ్యాండ్ మేళం పోటీలు మొదలు కానున్నాయి. డిజిపి సి.వి ఆనంద్ ఈ పోటీలను ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలతో పాటు అన్ని పారా మిలటరీ విభాగాల బ్యాండ్ మేళం బృందాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. మూడురోజులపాటు జరిగే ఈ పోటీలు బుధవారం ముగియనున్నాయి.

సిఎం రేవంత్‌రెడ్డికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

సజ్జన్నార్‌పై చర్యలు తీసుకోకుండా బదలీ ఎందుకు చేశారో చెప్పాలి

హైదరాబాద్ (గోషామహల్), నవంబరు 15ప్రభాత వార్త: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గోషామహల్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ లోధా ఆదివారం లేఖ రాశారు.ఆ లేఖలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసుపై కీలక విషయాలను ప్రస్తావించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చిన ఫోన్ ట్యాపింగ్ కుం భకోణంలో పలువురు రాజకీయ నాయకులు,వివిపిలు,ఇతర కీలక వ్యక్తుల ఫోన్లపై నిఘా పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయని రాజాసింగ్ పేర్కొన్నారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు రావడంతో పాటు, సజ్జన్నార్, రామకృష్ణారావు సలహా పలువురు ఉన్నతాధికా రుల ప్రమేయంపై ఆరోపణలు వచ్చినప్పటికి, దర్యాప్తు పురోగతి, దాని దిశపై ఇంకా అనేక ప్రశ్నలు మిగిలే ఉన్నాయని రాజాసింగ్ చెప్పుకొ చ్చారు. అప్పటి పోలీసు కమిషనర్ సజ్జనార్ పాత్రపైనా ఈకేసులోని అన్ని అంశాలపై నిష్పక్ష పాతంగా దర్యాప్తు జరిగిందా,లేదా అనే దానిపైనా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని చెప్పారు. అనుమానాలకు తావివ్వకుండా ఈ అంశాలపె స్వతంత్రంగా,పారదర్శకంగా విచారణ జరగాల్సి న అవసరం ఉందని తెలిపారు.మాజీ సిబిఐ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు సజ్జన్నార్‌పై అత్యంత తీవ్రమైన బహిరంగ వ్యాఖ్యలు చేసినట్లు తనకు సమాచారం ఉందని రాజాసింగ్ అన్నారు. పోలీసు యూనిఫాం వెనుక దాక్కున్న నేరస్తుడి ప్రవర్తన కలిగిన వ్యక్తిగా ఆయనను అభివర్ణిం చడంతోపాటు, చట్టపరమైన చర్యలు తీసుకో కుండా కేవలం బదలీ ఎందుకు చేశారంటూ మాజీ సిబిఐ డైరెక్టర్ నాగేశ్వరరావు ప్రశ్నించినట్లు చెప్పారు.మాజీ డైరెక్టర్ స్థాయి వ్యక్తి ఉన్న ఒక సీనయర్ పోలీసు అధికారిపై ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు చేసినప్పుడు ఎందుకు తెలంగాణ ప్రభుత్వం కేవలం బదలీ చేసి సరిపెట్టుకోవడం ఎంత వరకు న్యాయమని రాజాసింగ్ ప్రశ్నిం చారు. సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

కాగా సజ్జన్నార్ ఆస్తులు, ఆరోపణలు, ఎదుర్కొంటున్న ఆర్థిక అక్రమాలపై విచారణ చేయాలని రాజాసింగ్ పట్టు బట్టారు. కర్ణాటక లోని సజ్జన్నార్ స్వగ్రామం పరిసర ప్రాంతాల్లో సుమారు 100 ఎకరాల భూమిని కొనుగోలు చేసి నట్లు వార్తలు వస్తున్నాయని రాజాసింగ్ చెప్పారు. ఈ ఆస్తుల కొనుగోలుకు సంబంధించిన నిధుల మూలాలు, యాజమాన్య వివరాలు ప్రకటించిన ఆస్తులు, ఆర్థికలావాదేవీల పూర్తిస్థాయిలో పరిశీ లించాలని రాజాసింగ్ కోరారు.

అక్వాన్ తుఫాను భయంతో రాష్ట్రంలో జోరుగా వరి కోతలు, పత్తి సేకరణ

పోటెత్తిన ఇతర రాష్ట్రాల కూలీలు

హైదరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త: అక్వాన్ తుఫాను ముంచుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో చేతికందివచ్చిన పంటలను కాపాడుకునేందుకు రైతాంగం అప్రమత్తమైంది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా పత్తి సేకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో వరి కోతలు కూడా ఒకేసారి చేతికందడంతో రైతన్నలకు తీవ్రమైన కూలీల కొరత వెంటాడుతోంది. కుటుంబ సభ్యులతో కలిసి కష్టపడినా సరిపోకపోవడంతో అన్నదాతలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కూలీలపై ఆధారపడుతున్నారు. ఉపాధి కరవైన పంజాబ్, హర్యానా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి చిన్న పిల్లలతో సహా వలస కూలీలు పెద్దసంఖ్యలో తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చేరుకుం టున్నారు. దళారులు లేదా రైతులు నేరుగా అక్కడికి వచ్చి కూలీలతో మాట్లా డుకుని తమ పొలాలకు తరలించుకు పోతున్నారు. రాబోయే రెండు మూడు నెలలపాటు వీరంతా తెలంగాణ రాష్ట్రంలో కూలి పనులలో నిమగ్నం కాను న్నారు. రాష్ట్రంలో రాబోయే రెండు మూడు నెలలు పత్తి, వరి చేలు దిగుబడి అధికంగా ఉండనుండటంతో వీరికి చేతి నిండా పని దొరుకుతుంది. ఈ సీజన్‌లో పత్తి ఏరేకూలీలకు రైతులు కిలో పత్తికి రూ.10 నుంచి రూ.12 వర కు చెల్లిస్తున్నారు. అంతేకాకుండా రవాణా ఖర్చులు పూర్తిగా రైతన్నలే భరిస్తు న్నారు. కూలీలసంఖ్యను బట్టి ప్రతిరోజూ పాలు, తాగునీరు, చక్కెర అందిం చడంతో పాటు, వారానికి ఒకసారి తప్పనిసరిగా చికెన్ తెచ్చివ్వా లనే సరికొత్త నిబంధనలను కూలీలు పెడుతున్నారు. రైతులు కూలీల డిమాం డ్‌లకు ఒప్పుకుని వారికి కావాల్సిన సదుపాయాలను సైతం కల్పిస్తున్నారు. పత్తి ఏరడం, దాన్ని ట్రాక్టర్లలో ఎక్కించడం, సేకరించిన పత్తిని నిల్వ చేయడం తదితరపనుల కోసం తెలంగాణా రైతులు ఈ కూలీలతో ఒప్పందం చేసుకుంటున్నారు.

భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై 'జనజాతీయ గౌరవ దివస్' ర్యాలీ

హైదరాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త: భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహం నుండి కొమురం భీమ్ విగ్రహం వరకు 'జనజాతీయ గౌరవ దివస్' (గిరిజన గౌరవ దినోత్సవం) ర్యాలీ ఘనంగా జరిగింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపిలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్ తదితరులతో కలిసి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి 'భగవాన్ బిర్సా ముండా' చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులు భగవాన్ బిర్సా ముండాను బంధించిన రాంచీలోని పాత సెంట్రల్ జైలును, ఆయన త్యాగాలకు గుర్తుగా ఒక అద్భుతమైన స్మారక మ్యూజియంగా తీర్చిదిద్దామని తెలిపారు. 2021 నవం

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్, నవంబరు 15, ప్రభాతవార్త: పట్టాలు దాటుతున్న ఓగుర్తుతెలియని వ్యక్తి రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్- బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. ఆదివారం బెంగళూరు నుండి హజరత్ నిజాముద్దీన్ వెళ్లే రాజధాని ఎక్స్రెస్ (ట్రైన్ నెంబర్ 22691) ఘట్‌కేసర్, బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య కెఎం నెం.215/32- 36ల మధ్య ప్రమాదవశాత్తు రైలు పట్టాలు దాటుతున్న దాదాపు 36 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని మగ వ్యక్తిని ఢీకొట్టగా శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే మృతి చెందాడు. సికింద్రాబాద్ డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేయగా మృతుడి వద్ద అతడిని గుర్తించుటకు ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. మృతుడు 5.6 అడుగులు ఎత్తు, చామన చాయరంగు, వీపుపై కుడివైపు పుట్టుమచ్చ ఉన్నదని తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఇన్స్పెక్టర్ ఫోన్‌నెంబర్:8712658581కు, దర్యాప్తుఅధికారి ఫోన్‌నెంబర్: 9666280 808కు గాని సమాచారం అందించాలని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.



రైల్వేట్రాక్ పేల్చేసిన కేసులో మహిళ, మరో వ్యక్తి అరెస్టు

భారీ ఎత్తున ఆయుధాలు, తుటాలు స్వాధీనం

చండీగఢ్, నవంబరు 15: రైలు పట్టాలను పేల్చేసిన కేసులో ఒక మహిళ, ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి రెండు ఆయుధాలు, 46 కాట్రిడ్జ్‌లు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ మహిళకు పాకిస్థాన్‌తో సంబంధాలున్నట్లు పోలీస్ దర్యాప్తులో తేలింది. నవంబర్ 3న రాత్రి 9:45 గంటల సమయంలో రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లా రామ్ సింగ్‌పూర్ సమీపంలోని రైలు పట్టాలపై పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి రెండు రైల్వే స్లీపర్లు ధ్వంసం కావడంతో పాటు రెండున్నర అడుగుల లోతులో ఒక గొయ్యి ఏర్పడింది. అక్కడి రైలు పట్టాలకు నష్టం వాటిల్లింది. ఈ పేలుడుకు 75 నిమిషాల ముందు అనూప్‌గఢ్-సూరత్‌గఢ్ ప్యాసింజర్ రైలు ఈ ట్రాక్‌పై ప్రయాణించింది. నిందితులు ఈ రైలును పేల్చేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు అనుమానించారు. రాజస్థాన్ ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్), శ్రీ గంగానగర్ పోలీసులు, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా దీనిపై దర్యాప్తు చేపట్టారు. పాకిస్థాన్‌తో సంబంధాలున్న 21 ఏళ్ల మహక్‌దీప్ కౌర్, ఆమెకు సహకరించిన 22 ఏళ్ల దవీందర్ సింగ్‌ను పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో అరెస్ట్ చేశారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో జైలులో ఉన్న భర్త నుంచి విడిపోయిన కౌర్ వేరుగా నివసిస్తున్నదని పోలీస్ అధికారి తెలిపారు. పాకిస్థాన్‌లోని ఇద్దరు హ్యాండ్లర్లతో ఆమెకు సంబంధాలున్నాయని చెప్పారు. వారిలో ఒకరిని చాచా అని, మరొకరిని షా అని పిలుస్తారని వివరించారు. మరోవైపు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ హ్యాండ్లర్లు కౌర్‌తో ప్రేమపూర్వక సంభాషణలో పాల్గొని, ఆమెను ట్రాప్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. రైల్వే ట్రాక్‌పై పేలుడు జరిపేందుకు పాక్ హ్యాండ్లర్ల నుంచి ఆమె డబ్బు తీసుకున్నట్లుగా విచారణలో తేలిందని చెప్పారు. కౌర్ నుంచి రెండు ఆయుధాలు, 46 కాట్రిడ్జ్‌లు, రూ. 30,000 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులకు వసతి, బైక్, నేర స్థలానికి రవాణా సౌకర్యం కల్పించి సహకరించిన మరో ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.



ఏడోతరగతి ఫెయిల్ నుంచి పీహెచ్‌డీ

హోల్డర్‌గా సీఎంను మార్చలేం

బీహార్ సీఎం సామ్రాట్ చౌదరిపై జన్‌సురాజ్ చీఫ్ సెటైర్లు

పాట్నానవంబరు 15: బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి విషయంలో తన వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ తేల్చిచెప్పారు. ఇటీవల మరణించిన బీజేపీ నేత సంతాప సభలో సీఎం సామ్రాట్ చౌదరితో పీకే కరచాలనం చేస్తూ మాట్లాడిన వీడియో వైరల్ అయిన మర్నాడే ఆయన తన వైఖరిపై స్పష్టతనిచ్చారు. కరచాలనం చేసి, కలిసి మాట్లాడినంత మాత్రాన ఆయనపై తన అభిప్రాయం ఏమాత్రం మారదని పునరుద్ఘాటించారు. సీఎం సామ్రాట్ చౌదరిపై విమర్శలను మరింత తీవ్రతరం చేస్తూ, ఈ భేటీ వల్ల తన ఆలోచనల్లో ఎలాంటి మార్పు రాలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి విద్యార్హతలపై ప్రశ్నించిన ప్రశాంత్ కిషోర్ ఆయనను నేరస్థుడు అని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాను సీఎంను మళ్లీ కలిసినప్పటికీ, అది బీహార్ ముఖ్యమంత్రిని 7వ తరగతి ఫెయిల్ నుంచి పీహెచ్‌డీ హోల్డర్‌గా మార్చలేదని విమర్శించారు. ఇటీవల కన్నుమూసిన బీజేపీ నేత, మాజీ రాజ్యసభ ఎంపీ, సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు ఆర్‌కే సిన్హా సంతాప సభ పాట్నాలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ కిషోర్, సీఎం సామ్రాట్ చౌదరి ఎదురుపడ్డారు. ఈ భేటీపై మీడియా ప్రశ్నించగా తమ మధ్య ఉన్న విభేదాలు సమసిపోయాయనే ప్రచారాన్ని ప్రశాంత్ కిషోర్ కొట్టిపారేశారు. అది కేవలం మర్యాదపూర్వకంగా జరిగిన కలయిక మాత్రమేనని, దీనిని రాజకీయ పరిణామంగా చూడకూడదని ఆయన అన్నారు. చౌదరిపై తాను చేస్తున్న విమర్శలు సమంజసమైనవని, అవి కొనసాగుతాయని స్పష్టం చేశారు. మేము కేవలం సామాజిక, రాజకీయ మర్యాద పూర్వకంగానే కలిశాం ఒకరి కర్మలకు నేను హాజరైనప్పుడు, ఆయన కూడా అక్కడే ఉన్నారు. ఎవరినైనా కలిసినప్పుడు సామాజిక మర్యాద పాటించాలని బీహార్ సంస్కృతి మనకు నేర్పుతుంది. సామ్రాట్ చౌదరిని కలిసినంత మాత్రాన ఆయన ఏదో తరగతి ఫెయిల్ నుంచి పీహెచ్‌డీ హోల్డర్ అయిపోర్మ అని కిషోర్ అన్నారు. నేను గతంలో ఆయనను నేరస్థుడు అని పిలిచి ఉంటే, రేపు ఆయనను సాధువు అని పిలవడం మొదలుపెట్టను. అలాంటి అపోహలు పెట్టుకోవద్దు. ప్రజాస్వామ్య పోరాటం వేరు. నేను నితీష్ కుమార్‌తో కలిసి పనిచేశాను, ఆయనను వ్యతిరేకించాను కూడా. కానీ నాకు ఆయనతో గానీ, లాలూ ప్రసాద్‌తో గానీ, మరెవరితో గానీ వ్యక్తిగత పోరాటం లేదు. మా పోరాటం బీహార్ అభివృద్ధి కోసమే తప్ప, ఏ వ్యక్తికో, కులానికో, వర్గానికో లేదా రాజకీయ పార్టీకో వ్యతిరేకంగా కాదని ఆయన పేర్కొన్నారు.

తక్షణ సాయం కావాలి

కేంద్ర బృందంతో ఎపి సిఎం చంద్రబాబు వర్చువల్ భేటీ

అమరావతి, నవంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రానికి తక్షణ తుఫాన్ సహాయం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి తెలిపారు. మురసు తుఫాన్ నష్టాన్ని అంచనా వేయడానికి రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో వర్చువల్‌గా సమావేశమైంది. కేంద్రహోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృ త్వంలోని ఏడుగురుసభ్యుల బృందం క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన అంశా లను ముఖ్యమంత్రికి వివరించింది. రాష్ట్రంలో ఎల్ నినో, వరుస తుఫాన్ల వల్ల ఎదుర్కొంటున్న పరిస్థితులను సిఎం చంద్రబాబు వివరించగా తాముపరిశీలించిన విషయాలన సిఎం వద్ద ప్రస్తావించింది.

కలియుగ బ్రహ్మాండం ఎస్వీ మ్యూజియం



• తిరుమల చరిత్రకు సరికొత్త వైభవం • నేటి నుండి సందర్శకులకు అనుమతి

తిరుమల, నవంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రం ఆధ్యాత్మికతకు మాత్రమే కాదు.. అద్భుతమైన చరిత్రకు, అపురూపమైన శిల్పకళా సంపదకు, సనాతన ధర్మ వైభవానికి కూడా నిలయం. తరతరాలుగా భక్తులు ఆరాధిస్తున్న శ్రీవారి దివ్యక్షేత్ర విశిష్టతను, వేల సంవత్సరాల చారిత్రక వారసత్వాన్ని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఒకే చోట ఆవిష్కరించే అద్భుత వేదికగా తిరుమలలో నూతనంగా ఆధునీకరించిన వేంకటేశ్వర మ్యూజియం రూపుదిద్దుకుంది.

ఒకవైపు భక్తి భావాన్ని పెంపొందిస్తూ..

మరోవైపు చరిత్రను కళ్లకు కడుతూ:

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విశ్వ రహస్యాలను పరిచయం చేస్తూ రూపొందించిన ఈ మ్యూజియం నిజంగా ఒక కలియుగ బ్రహ్మాండం! తిరుమలలో సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తులుగా ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సాంకేతిక సహకారంతో రూపొందించిన ఈ మ్యూజియంలో 14 ప్రత్యేక గ్యాలరీలు ఉన్నాయి. సుమారు 8వేలకు పైగా పురాతన కళాఖండాలు, చారిత్రక వస్తువులు, శిల్పాలు, అరుదైన సంపదతో పాటు డిజిటల్ ప్రదర్శనలు సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. ప్రతి గ్యాలరీ ఒక ప్రత్యేక అంశాన్ని ప్రతిబింబించేలా రూపొందించడం ఈ మ్యూజియం ప్రత్యేకత. శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యరూపం, ఆలయ చరిత్ర, భారతీయ శిల్పకళ, దేవాలయ నిర్మాణ వైభవం, సంగీతం, నృత్యం, పూజా సంప్రదాయాలు, పురాతన ఆయుధాలు ఇలా విభిన్న అంశాలు ఇక్కడ కొలువుదీరాయి.

-భారతీయ సంస్కృతిలో శిల్పకళకు ప్రత్యేక స్థానం :ఈ మ్యూజియంలో భారతీయ సంస్కృతిలో శిల్పకళకు ప్రత్యేక స్థానం ఉంది. రాతి శిల్పాలు, కాంస్య విగ్రహాలు ఆనాటి కళాకారుల నైపుణ్యానికి, భక్తి భావానికి ప్రతీకలు. మ్యూజియంలోని స్టోన్ స్కల్ప్చర్, బ్రాంజ్ స్కల్ప్చర్ గ్యాలరీలు ఈ కళా వైభవాన్ని సందర్శకులకు పరిచయం చేస్తాయి.

శిల్పకళావైభవం...చరిత్రకు సజీవ సాక్ష్యం:దేవాలయ నిర్మాణ శైలి, శిల్పాల వెనుక ఉన్న ఆధ్యాత్మిక భావనలు, శతాబ్దాల నాటి కళా సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం ఇక్కడ లభిస్తుంది. తిరుమల ఆలయ నిర్మాణ చరిత్ర, దాని పరిణామ క్రమం, దాతలు అందించిన కానుకలు, పూజా విధానాలకు సంబంధించిన అంశాలు భక్తులకు విశేష ఆసక్తిని కలిగిస్తాయి.

అన్నమయ్య సంకీర్తనల నుండి ఆధ్యాత్మిక సంగీతం వరకు:

తెలుగు పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన వేలాది సంకీర్తనలు శ్రీవారి భక్తి వైభవాన్ని ప్రపంచానికి చాటాయి. అన్నమయ్య, నాణేల చరిత్రకు సంబంధించిన గ్యాలరీతో పాటు సంప్రదాయ సంగీత వాయిద్యాల ప్రదర్శన కూడా మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

భారతీయ సంగీతం, నృత్యం, శిల్పకళల సమ్మేళనాన్ని ప్రతిబింబించే ప్రదర్శనలు మన కళా వారసత్వాన్ని కొత్త తరాలకు పరిచయం చేస్తాయి

-బ్రహ్మాండం గ్యాలరీ.. విశ్వాన్ని ఆవిష్కరించే అద్భుతం:

ఈ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నది బ్రహ్మాండం గ్యాలరీ. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూపొందించిన ఈ గ్యాలరీలో విశ్వం, సృష్టి రహస్యాలు, బ్రహ్మాండ విస్తృతి వంటి అంశాలను వినూత్నంగా ఆవిష్కరించనున్నారు. హోలోగ్రాఫిక్ ప్రదర్శనలు, 360 డిగ్రీల సౌండ్ అనుభూతి, డిజిటల్ విజువల్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సందర్శకులకు సరికొత్త అనుభవాన్ని అందించనుంది. సాధారణంగా పుస్తకాల్లో చదివే విశ్వ సంబంధిత అంశాలను దృశ్యానుభూతి ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించడం ఈ గ్యాలరీ ప్రత్యేకత.

ఆధ్యాత్మికతకు ఆధునికత జోడింపు:

గత వైభవాన్ని భద్రపరచడమే కాకుండా, దానిని భావితరాలకు అర్థమయ్యే రీతిలో అందించడమే ఆధునిక మ్యూజియంల లక్ష్యం. ఈ దిశగా ఎస్వీ మ్యూజియంలో సంప్రదాయ కళాఖండాలతో పాటు డిజిటల్ ఆర్కైవ్స్, ఆధునిక ప్రదర్శన సాంకేతికతకు ప్రాధాన్యం కల్పించారు. భక్తులు కేవలం ప్రదర్శన వస్తువులను చూడటమే కాకుండా వాటి వెనుక ఉన్న చరిత్ర, విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను తెలుసుకునేలా ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దారు.

భావితరాలకు తిరుమల వారసత్వ సంపద: నేటి తరానికి తిరుమల చరిత్రను పరిచయం చేయడంతో పాటు భావితరాలకు అపురూపమైన వారసత్వ సంపదను అందించడం ఈ మ్యూజియం ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా విద్యార్థులు, పరిశోధకులు, చరిత్రకారులు, కళాభిమానులకు ఇది ఒక విజ్ఞాన భాండాగారంగా ఉపయోగపడనుంది. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తిరుమల క్షేత్ర చరిత్ర, ఆలయ సంప్రదాయాలు, శిల్పకళా వైభవం, సనాతన సంస్కృతిని మరింత లోతుగా తెలుసుకునేందుకు ఈ మ్యూజియం చక్కని అవకాశాన్ని కల్పించనుంది. తిరుమల క్షేత్ర పవిత్రతను, చారిత్రక సంపదను పరిరక్షిస్తూ భక్తులకు మరింత సమగ్ర అనుభూతిని అందించాలనే లక్ష్యంతో టిటిడీ ఈ మ్యూజియాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆధునీకరించింది. నవంబర్ 16 (నేటి)నుండి సాధారణ భక్తుల సందర్శనకు అందుబాటులోకి రానున్న ఈ మ్యూజియానికి ప్రవేశ రుసుము 50రూపాయలుగా టిటిడి నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు భక్తులు మ్యూజియంను సందర్శించవచ్చు. సాయంత్రం 4 గంటల వరకు టికెట్లు కేటాయించడం జరుగుతుంది. భక్తి, చరిత్ర, కళ, సంస్కృతి, విజ్ఞానం, సాంకేతికత.. ఇలా ఎన్నో విశిష్టతల సమాహారంగా రూపుదిద్దుకున్న ఎస్వీ మ్యూజియం తిరుమల క్షేత్రానికి మరో ఆధ్యాత్మిక ఆకర్షణగా నిలవనుంది. శ్రీవారి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక పరవశాన్ని అందిస్తే.. ఈ మ్యూజియం ఆ దివ్యక్షేత్రం వెనుక ఉన్న అపారమైన చరిత్రను, సంస్కృతిని, బ్రహ్మాండమైన వైభవాన్ని పరిచయం చేయనుంది. ఇది కేవలం ఒక మ్యూజియం కాదు.. కలియుగ దైవం కొలువైన దివ్యక్షేత్ర చరిత్రను, భారతీయ సనాతన సంస్కృతిని, విశ్వ వైభవాన్ని ఒకే చోట ఆవిష్కరించే కలియుగ బ్రహ్మాండం.

ఎపిలో సినిమా తరహాలో కిడ్నాప్

సిబిఐ అంటూ రియల్టర్ అపహరణ

కర్ణాటకలో ఓ ఫాంహౌస్‌కు తరలింపు

రూ.5 కోట్లు డిమాండ్, రూ.26 లక్షలు జమ

పోలీసుల రంగప్రవేశం, నిందితుల అరెస్ట్



మదనపల్లె(క్రైం), నవంబరు 15 ప్రభాతవార్త: ఆరు మంది వ్యక్తులు తాము సిబిఐ అధికారులు అంటూ వచ్చి ఓ వ్యాపారిని కిడ్నాప్ చేసిన ముఠాను మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు ఆదివారం ఛేదించారు. బాధితుడిని సురక్షి తంగా విడిపించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సిఐ మోహన్, ఎస్ఐలు రహీముల్లా, రామకృషా ర్లెడ్డిలు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె ఆగస్త్యా వీధికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సాదిక్ ఈ నెల 10న మధ్యాహ్నం మడికాయల శివాలయం మీదుగా మల్లికార్జున సర్కిల్ వైపు కారులో వెళ్తుం డగా, ముఠాసభ్యులు అతని కారును అడ్డుకుని. తాము సిబిఐ, నీపై కేసు ఉంది అంటూ నకిలీ సిబిఐ ఐడి కార్డులు, అరెస్ట్ వారెంట్ చూపి బలవంతంగా కారులో ఎక్కించుకుని కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లాలోని ఓఫాంహౌస్‌కు తీసుకెళ్లారు. కేసు నుంచి తప్పించాలంటే రూ.5 కోట్లు కావాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు.

ఫాంహౌస్‌లో రెండు రోజులపాటు బాధితుడిని బంధించి మానసికంగా, శారీరకంగా భయభ్రాంతు లకు గురిచేశారు. కుటుంబానికి దూరమై, ప్రాణ భయంతో వణికిపోయిన సాదిక్ భయపడి బంధు వులు, స్నేహితుడి సాయంతో రూ.26 లక్షలు వారి ఖాతాకు బదిలీ చేయించాడు. బాధితుడి సోదరుడి ఫిర్యాదుతో వన్‌టౌన్ పిఎస్‌లో కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో, ఎస్‌డిపిఒ బి.ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక బృం దాలు రంగంలోకి దించారు. ఈ నెల 14న మధ్యాహ్నం 3గంటలకుమదనపల్లె- బెంగళూరు రోడ్డులో కాపుకాసి ముఠాను పట్టుకున్నారు. రియల్టర్ సాదిక్‌ను సురక్షితంగా విడిపించి నిందితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. రూ.26 లక్షల ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయి తిరుపతికి చెందిన రమణ పరారీలో ఉండగా, అరెస్టయిన వారిలో చిత్తూరు కట్టమంచికి చెందిన రాజా శ్రీనివాసులు అలియాస్ ఆర్.శ్రీవానన్ (40), మైసూరుకు చెందిన ఎం.పి.సోహన్ భరత్ (39), బెంగళూరుకు చెందిన కె.ఎన్. సార్థక్ రాజ్ (33), చేతన్ రాజు (31), చిత్తూరు టౌన్ అంబేద్కర్ నగర్‌కు చెందిన పి. సురేష్ సింగ్ (40),వేణు గుణశేఖర్ (30) ఉన్నారు. నిందితుల నుంచి రెండు నకిలీ సిబిఐ ఐడి కార్డులు, డమ్మీ పిస్టల్, జత చేతి సంకెళ్లు, 22 పేజీల ఫైల్, కెఎ51 ఎంఎస్0489 నంబరు గల ఇన్నోవా క్రిస్టా కారు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు రమణను అరెస్ట్ చేయాల్సి ఉందని సిఐ తెలిపారు. అరెస్టయిన నిందితులందరూ వివిధ కేసుల్లో ముద్దాయిలు. కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతూ విడిపోయి వేరువేరు చోట్ల స్థిరపడ్డారని సిఐ తెలి పారు. ఈక్రమంలో డబ్బు బాగా సంపాదిం చుకున్న సాదిక్‌ను కిడ్నాప్ చేయాలని సినిమా తరహాలో స్కెచ్ వేసి పథకం ప్రకారం మదనపల్లిలో రియల్టర్ సాదిక్‌ను నిందితులు కిడ్నాప్ చేసినట్లు తెలిపారు.

అవన్నీ వక్రభాష్యాలు, తప్పుడు కథనాలే..

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



నాగ్‌పూర్, నవంబరు 15: నితిన్ గడ్కరీ రాజకీయాల నుంచి తప్పుకుం టున్నారంటూ వస్తున్న వార్తలను కేంద్రమంత్రి తీవ్రంగా ఖండించారు. అవన్నీ తప్పుడు కథనాలని, ఆ కథనాల్లో ఎలాంటి నిజం లేదని అన్నారు. చివరిశ్వాసవరకూ ప్రజాజీవితంలోనే కొనసాగుతానని, తన వ్యాఖ్యలను మీడియా వర్గాలు తప్పుగా అర్థం చేసుకున్నాయని పేర్కొన్నారు. నేను తరచూ యువతను ముందుకు తీసుకురావాలని అంటుంటాను. దాని అర్థం నేను పదవి నుంచి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని కాదు. ముందు తరాల వారు మనకు బాధ్యతలు ఎలాగైతే అప్పజెప్పారో అదేవిధంగా మనం కూడా మన తర్వాత తరాల వారికి బాధ్యతలు అందిద్దాం అనేది నా ఉద్దేశ్యం అని గడ్కరీ స్పష్టంచేశారు. ప్రస్తుతం ఉన్న జర్నలిస్టుల స్థానంలో ఇంతకుముందు వేరే వాళ్లు ఉండేవారని, ఇప్పుడు మీరు విలేకరులుగా చేస్తున్నారని గడ్కరీ మీడియా ప్రతినిధులను ఉద్దేశించి అన్నారు. మీలాగే నేను కూడా ప్రభుత్వం తరపున పని చేస్తూనే ఉంటానని, గతంలో నేను చేసిన వ్యాఖ్యలకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అప్పుడు మాట్లాడింది నాగ్‌పుర్‌లో తాను ఏర్పాటుచేసిన లక్ష్మణ్‌రావ్ మన్కర్ ట్రస్ట్ గురించని తెలిపారు. ఆ ట్రస్టు కింద ఆదివాసీ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నడుస్తున్నా యని అన్నారు. ట్రస్టు విషయంలో మునుపటిలా బాధ్యతలు నిర్వహిం చలేనని, అందుకే యువతరానికి అవకాశం ఇవ్వాలని ట్రస్టు సభ్యులకు సూచించానని గడ్కరీ చెప్పారు. కానీ మీడియా ఛానళ్లు ఆ వ్యాఖ్యలను రాజకీయాలతో ముడిపెట్టాయని అన్నారు.

వందేభారత్‌కు బ్రేకింగ్ ఇబ్బందులు..

463 కిలోమీటర్ల ప్రయాణం, దర్యాప్తునకు ఆదేశం



రాంచి, నవంబరు 15: ఉత్తర్ ప్రదేశ్, జార్ఖండ్ మధ్య అక్టోబర్ నెలలో ఓ ఖాళీ వందే భారత్ రైలు అసమర్థమైన బ్రేకింగ్ వ్యవస్థతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో అధికారులు దాన్ని ఏకంగా 463 కిలోమీటర్ల ప్రయాణించేందుకు అనుమతించారన్న అంశం తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా బయటపడిన ఈ వ్యవహారం రైల్వేల పనితీరుకు అద్దం పట్టేలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ వందే భారత్ రైలు ఇతర ప్యాసింజర్ రైళ్లకు ముప్పు కలిగించే అవకాశం ఉందని తేల్చారు. దాదాపు ఇలాంటి నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 11న అస్సాంలో కోల్ కతాసైరంగ్ ఎక్స్ ప్రెస్ పట్టాలు తప్పడానికి ముందు జరిగిన ఈ ఘటనపై విచారణకు వాయువ్య రైల్వే ఆదేశించింది. తగినంత బ్రేక్ శక్తి లేకుండా రైలును నడపడం తీవ్రమైన భద్రతా సమస్య అని, ఇది సిబ్బంది, ప్రయాణికుల ప్రాణాల్ని ప్రమాదంలో పడేస్తుందని, అలాగే రైల్వే కార్యకలాపాల భద్రతను ప్రభావితం చేస్తూ ఓ పెద్ద ప్రమాదానికి దారి తీయవచ్చని రైల్వే జోన్ తెలిపింది. జార్ఖండ్ లోనని హతియా నుంచి ఉత్తర్ ప్రదేశ్ లోని ఝాన్సీకి ఓ సరకు రవాణా రైలు ద్వారా ఈ వందే భారత్ ఖాళీ ఫైర్ కార్ బోగీని తరలించాల్సి ఉంది. అలాగే ఈ వందే భారత్ బ్రేకింగ్ వ్యవస్థ.. దాన్ని లాగే మరో సరకు రవాణా రైలు బ్రేకింగ్ వ్యవస్థతో లింక్ చేయాల్సి ఉందన్నారు. అయితే రైల్వే సిబ్బంది ఈ రెండు వ్యవస్థలు సరిగానే అనుసంధానించినట్లు గుర్తించడంలో విఫలమయ్యారని తెలిసింది. అలాగే రైలు సిబ్బంది నుంచి వచ్చిన హెచ్చరికల్ని సైతం పట్టించుకోలేదన్నారు. దీంతో ఈ వ్యవహారంపై రైల్వే దర్యాప్తునకు ఆదేశించింది.

25 దాకా 'తెలంగాణ తిరుపతి'లో బ్రహ్మోత్సవాలు

నేడు ఉద్దాల మహోత్సవం



ఉద్దాలను తయారు చేస్తున్న దళితులు

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 15 ప్రభాత వార్త : పాలమూరు ప్రజల ఇలవేల్పు దైవం..తెలంగాణ తిరుపతి.. పేదల తిరుపతిగా పేరొందిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. కురుమూర్తి స్వామి ఉమ్మడి పాలమూరు వాసులకు ఇలవేల్పు. ఏటా నవంబర్‌లో జరిగే బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. స్వామివారి కల్యాణోత్సవంతో జాతరలో ఆధ్యాత్మిక సందడి మొదలైంది. ఇక గోవింద నామస్మరణతో కురుమూర్తి కొండలు మారుమోగుతున్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనుండగా.. జాతర మాత్రం సుమారు నెలన్నర పాటు కొనసాగనుంది. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురం సమీపంలోని కురుమూర్తి క్షేత్రం తెలంగాణలోని ప్రసిద్ధ ప్రాచీన పుణ్యక్షేత్రాల్లో ఒకటి. ఇక్కడి ప్రకృతి అందాలు, ఏడు కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం తిరుమల క్షేత్రాన్ని తలపిస్తాయి. దేవరగట్టుపై ఉన్న కాంచన గుహలో లక్ష్మీ మ్మ సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామి స్వయంభూగా కొలువుదీరాడు. ఇక్కడి స్వామివారి విగ్రహం తిరుమల శ్రీవారి మూర్తిని పోలి ఉండటం ఈ క్షేత్ర ప్రత్యేకతగా చెబుతారు. దాదాపు 900 ఏళ్లుగా స్వామివారు పూజలు అందుకుంటున్నట్లు స్థానిక చరిత్ర చెబుతోంది. పచ్చికుండలో అన్నం, పచ్చి పులుసునే పరమ నైవేద్యంగా సమర్పిస్తే స్వామివారు కోరిన కోర్కెలు తీరుస్తారని ఇక్కడికి వచ్చే భక్తుల నమ్మకం.

నేడు ఉద్దాల మహోత్సవం..

కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో ఉద్దాల (పాదుకల) ఊరేగింపు అత్యంత ప్రధాన ఘట్టం. ఈ ఉత్సవం కోసం ప్రత్యేకంగా తయారు చేసే స్వామివారి పాదుకలకు ఎంతో విశిష్టత ఉంది. పల్లమర్రి నుంచి చాటను ఊరేగింపుగా వడ్డేమాన్ గ్రామానికి తీసుకువస్తారు. అక్కడ నియమ నిష్ఠలతో స్వామివారి పాదుకలను తయారు చేస్తారు. అనంతరం వాటిని ఊరేగింపుగా కురుమూర్తి దేవస్థానానికి తీసుకొస్తారు. ఈ ఉద్దాల ఉత్సవాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. స్వామివారి పాదుకలను దర్శించుకుంటే కష్టాలు తొలగి, మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం.

ఎపిలో కమ్ముకొస్తున్న మరో తీవ్ర తుఫాన్

కోస్తాంధ్ర జిల్లాల్లో అతి భారీ వర్షాలు

వాతావరణశాఖ హెచ్చరిక

అమరావతి, నవంబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ తాజా హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం సోమవారం తుఫాన్‌గా మారే అవకాశముందని తెలిపింది. ఆ తర్వాత నవంబరు 17వ తేదీన తీవ్ర తుఫాన్‌గా మారనుందని హెచ్చరించింది. ఈ క్రమంలో రాబోయే మూడ్రోజుల పాటు ఎపిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఆగ్నేయ, ఆను

ఉత్కంఠకే ఊపిరి అందని

కుర్రాళ్ల కిర్రాక్ షో

ఉక్కిరి బిక్కిరి అయిన దాయాది దేశాలు

అసలు సిసలైన భారత్-పాక్ మ్యాచ్

ఒమన్: పురుషులైనా, మహిళలైనా, టోర్నీ ఏదైనా, మ్యాచ్ ఏ స్థాయిదైనా, భారత్‌తో మ్యాచ్ అంటే పాకిస్థాన్ నుంచి కనీసం పోటీ కూడా ఎదురవ్వడం లేదు. భారత్‌పై పాక్ గెలిచి పుష్కర కాలమవుతోంది. మ్యాచ్‌లు పూర్తిగా ఏకపక్షంగా మారి దాయాదుల పోరంటేనే ఆసక్తి సన్నగిల్లిపోయింది. ఇలాంటి సమయంలో భారత్‌పాక్ అండర్19 ఆసియా కప్ ఫైనల్ అభిమానులకు అసలు సిసలు మజాను అందించింది. ఉత్కంఠకే ఊపిరి అందని రీతిలో సాగిన ఈ మ్యాచ్ ఇరు దేశాల అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆఖరి బంతి వరకు పాకిస్థాన్‌ను ఊరించిన విజయం క్షణాల్లో కనుమరుగైంది. ఆఖరి బంతికి బౌండరీ రావడంతో భారత్ ఒక్క వికెట్‌తో చిరస్మరణీయమైన విజయాన్ని అందుకుంది. అసలు సిసలు దాయాదుల పోరు. ఒత్తిడిని అధిగమించి అసాధారణ విజయాన్ని



అందుకున్న కుర్రాళ్ల కిర్రాక్ షోగా రికార్డు సృష్టించింది. ఇది కదా భారత్‌పాక్ మ్యాచ్ అంటే అని సగర్వంగా చెప్పుకునే పరిస్థితి కల్పించింది. భారత్ విజయం అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేసినా, అసాధారణమైన మ్యాచ్ అనే సంతృప్తి పాక్ ఫ్యాన్స్‌కు మిగిల్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 9 వికెట్లకు 337 పరుగుల భారీ స్కోర్ చేయగా, భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 339 పరుగులు చేసి గెలుపొందింది. లక్ష్య ఛేదనలో 252/8 స్కోర్‌తో ఓటమి దిశగా సాగిన భారత్‌ను మనల్ చౌహాన్(32 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 47), ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ మోహిత్ ఉల్వా(26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49) అద్భుత పోరాటంతో గెలిపించారు. ఆఖరి బంతికి 3పరుగులు అవసరం కాగా, ఉల్వా బౌండరీ బాది భారత్‌ను గెలిపించాడు. అసాధ్యమనుకున్న విజయాన్ని సుసాధ్యం చేశాడు.

ప్రధాని మోదీ ఫిదా.. ఈ విజయానికి ప్రధాని మోడీ కూడా ఫిదా అయ్యారు. కుర్రాళ్ల విజయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా కొనియాడారు. 'భారత క్రికెట్‌కు ఇది అద్భుతమైన రోజు. గొప్ప ప్రదర్శనతో అండర్19 ఆసియాకప్ గెలిచిన యువ క్రికెటర్లను చూస్తే సగర్వంగా ఉంది. ఈ విజయం కుర్రాళ్లకు స్ఫూర్తినిస్తుంది' అని ప్రధాన నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు.



భారత్ సంచలన విజయం

న్యూజిలాండ్‌పై 3-1తో సిరీస్ కైవసం

మౌంట్ మాంగనూయి: భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన ఐదు వన్డేల సిరీస్ చివరి మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టింది. మౌంట్ మాంగనూయ్‌లోని బే ఓవల్ వేదికగా ఆదివారం జరిగిన ఐదో వన్డేలో 22 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి 3-1తో టీమిండియా సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఆరంభం నుంచే కష్టాలు ఎదురయ్యాయి. రోహిత్ శర్మ 7, విరాట్ కోహ్లీ 5 పరుగులకే వెనుదిరిగారు. రుతురాజ్ గైక్వాడ్ 18, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 22 పరుగులు చేశారు. ఆ తర్వాత అక్షర్ పటేల్, ఇషాన్ కిషన్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరూ చెరో 46 పరుగులు చేసి అర్ధ సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో ఔటయ్యారు. నమన్ ధీర్ 22 పరుగులు చేయగా, మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించకపోవడంతో భారత్ 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. భారత్ 166 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ చివరి వికెట్‌కు కీలక భాగస్వామ్యం అందించారు. ఇద్దరూ చెరో 14 పరుగులు చేశారు. ముఖ్యంగా అర్ష్‌దీప్ కేవలం నాలుగు బంతుల్లోనే రెండు సిక్సర్లు బాదాడు. వీరిద్దరూ కలిసి 26 పరుగులు జోడించడంతో భారత్ స్కోరు 200 దాటింది. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్ 3, జాకబ్ డఫీ 3, మ్యాట్ ఫిషర్ రెండు వికెట్లు సాధించారు. ఇక 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు మహమ్మద్ సిరాజ్ తొలి దెబ్బ తీశాడు. టిమ్ సీఫర్ట్ 14 పరుగుల వద్ద ఔటయ్యాడు. ఆ తర్వాత విల్ యంగ్ 22 పరుగులు చేసి అర్ష్‌దీప్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. నిక్ కెల్లీ 24 పరుగులు చేశాడు. ఫిన్ అలెన్ ఒక్క పరుగుకే సిరాజ్‌కు వికెట్ ఇచ్చాడు. ఆ తర్వాత డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ 31 పరుగులు, మైఖేల్ బ్రేస్‌వెల్ 19 పరుగులు చేసి పోరాడారు. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 24 పరుగులు, క్రిస్టియన్ క్లార్క్ 16 పరుగులు చేసినా న్యూజిలాండ్‌ను గెలిపించలేకపోయారు. సాంట్నర్‌ను నమన్ ధీర్ ఔట్ చేయగా, క్లార్క్‌ను అర్ష్‌దీప్ సింగ్ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత అక్షర్ పటేల్ జాకబ్ డఫీని ఔట్ చేయడంతో కివీస్ చివరి వికెట్లు కూడా కోల్పోయింది. 48.1 ఓవర్లలో 187 పరుగులకు న్యూజిలాండ్ ఆలౌటైంది.

ఫుట్‌బాల్‌లో న్యూజిలాండ్ గెలుపు

0-3 తేడాతో భారత్ ఓటమి

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన తమ రెండవ అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో భారత పురుషుల జాతీయ ఫుట్‌బాల్ జట్టు న్యూజిలాండ్ చేతిలో 0-3 తేడాతో ఓటమి చవిచూసింది. ఆరంభం నుంచే న్యూజిలాండ్ ఆధిపత్యం చెలాయించి అర్ధభాగంలోనే భారత్‌ను కట్టడి చేసింది. తొలిసారిగా భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవరిస్తున్న ర్యాన్ విలియమ్స్ ఐదుగురు డిఫెండర్లతో కూడిన పటిష్టమైన ఫార్మేషన్‌ను అవలంబించినప్పటికీ, న్యూజిలాండ్ అవకాశాలను సృష్టిస్తూనే ఉంది. కాలమ్ మెక్‌కోవాట్ కొట్టిన కార్నర్‌ను సుర్మాన్ హెడర్‌తో గోల్‌గా మలిచి, ప్రతిష్టంభనను బద్దలు కొట్టాడు. గోల్ కీపర్ విశాల్ కైత్ పలుమార్లు అద్భుతంగా అడ్డుకున్న తర్వాత, 40వ నిమిషంలో మాథ్యూ గార్బెట్, జెస్సీ రాండాల్‌ల సమన్వయంతో వుడ్ గోల్ సాధించాడు. 55వ నిమిషంలో మెక్‌కోవాట్‌ను అడ్డుకుని, ఫ్రాన్సిస్ డి ప్రీస్ చేసిన ఫాలోఅప్ ప్రయత్నాన్ని కూడా పట్టుకున్నాడు. ఆట మొదలైన గంటకు కొద్దిసేపటి ముందు భారత్, లాల్‌రిన్లియానా హ్నామ్టే, ముహమ్మద్ సుహైల్, లిస్టన్ కొలాకో మరియు టోంబా సింగ్ హావోబామ్‌లను బరిలోకి దించింది. 81వ



నిమిషంలో టోంబా, హ్నామ్టే అందించిన పాస్‌తో లిస్టన్ ఒక అవకాశాన్ని దక్కించుకున్నాడు, కానీ అతను దూరం నుండి కొట్టిన షాట్ క్రాస్‌బార్ పైనుండి వెళ్లిపోయింది. 86వ నిమిషంలో న్యూజిలాండ్ నాలుగో గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చింది, కానీ తివారీ తన గోల్ నుండి దృష్టి మరల్చడంతో అలెక్స్ రూఫర్ గోల్ వైపు కొట్టిన హెడర్‌ను బిజోయ్ వర్గీస్ గోల్ లైన్ పైనుంచి క్లియర్ చేశాడు. భారత్ మరింత నష్టాన్ని నివారించుకుంది కానీ ఆధిక్యాన్ని తగ్గించలేకపోయింది.

కుమామోటో ఛాంపియన్‌గా లక్ష్య

కుమామోటో: జపాన్‌లోని కుమామోటోలో ఆదివారం జరిగిన కుమామోటో మాస్టర్స్ జపాన్ ఓపెన్ ఫైనల్ పోటీలో లక్ష్యసేన్ ఛాంపియన్‌గా నిలిచాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో భారత ఆటగాడు లక్ష్యసేన్ అద్భుతమైన పునరాగమనం చేసి, స్వదేశీ అభిమాన ఆటగాడు కోకి వతనాబేను ఓడించి టైటిల్‌ను గెలుచుకున్నాడు. తొలి గేమ్‌లో ఓడిపోయిన తర్వాత, ప్రపంచ 13వ ర్యాంకర్ అయిన లక్ష్య తర్వాతి రెండు గేమ్‌లలో పుంజుకుని, గంటా నాలుగు నిమిషాల్లో జరిగిన పోరులో 13-21, 21-18, 21-14 స్కోరుతో విజయం సాధించాడు. ఫైనల్ గేమ్‌లో, సేన్ 11-7 కీలక ఆధిక్యాన్ని సాధించి మొత్తం తొమ్మిది పాయింట్లకు పెంచుకుంటూ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. చివరి రెండు మ్యాచ్‌లలో జపానీ యుడు విజయం సాధించాడు. దీంతో సేన్ హాంగ్‌జౌలో జరిగే బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించే స్థానానికి చేరుకున్నాడు. ఈ ఈవెంట్‌కు ముందు, ఎనిమిదో సీడ్ అయిన అతను 64,980 పాయింట్లతో రేస్ టు ఫైనల్స్ స్టాండింగ్స్‌లో 12వ స్థానంలో ఉన్నాడు. సీజన్ ముగింపులో జరిగే ఈ ఈవెంట్‌కు అర్హత సాధించాలంటే అతను టాప్ ఎనిమిది స్థానాల్లోకి రావాల్సి ఉంది. సూపర్ 500 ఈవెంట్‌లో టైటిల్ గెలుచుకోవడం ద్వారా లక్ష్య 9,200 పాయింట్లను సంపాదించాడు.





మూడో రౌండ్‌కు నిషాన్

కార్సన్ (కాలిఫోర్నియా): భారత్‌బాక్సర్ నిశాంత్‌దేవ్ ఆదివారం కార్సన్‌లో మరో విజయంతో తన అజేయ రికార్డును కొనసాగిస్తూ తన ప్రొఫెషనల్ కెరీర్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాడు. 3వ రౌండ్‌లో 2:52 నిమిషాల వద్ద రెఫరీ రాబర్ట్ హోయల్ పోటీని నిలిపివేయడంతో భారత్‌సూపర్ వెల్టర్‌వెయిట్ బాక్సర్ సోనా అకాలెనుఓడించాడు. దీంతో, దేవ్ తన అజేయ రికార్డును 8-0కి పెంచుకోగా, అందులో 6నాకౌట్‌లతో ముగిశాయి. కాగా, అకాలే ప్రొఫెషనల్ రికార్డు 10-6కి పడిపోయింది. 25 ఏళ్ల అతను, డారియస్ ఫుల్హమ్ వర్సెస్ డియెగో పచేకో పోరుకు ముందు జరిగిన అండర్‌కార్డ్ పోరులో తలపడ్డాడు. ఆ పోరులో ఫుల్హమ్ ఏకగ్రీవ నిర్ణయంతో గెలిచాడు. ఆరంభ గంట మోగినప్పటి నుంచే దేవ్ పూర్తి నియంత్రణలో ఉన్నట్లు కనిపించాడు. ఆభారత్‌ఆటగాడు తన అద్భుతమైన చేతి వేగాన్ని, పదునైన ఎడమ చేతి దెబ్బలను ఉపయోగించి ప్రత్యర్థిని వెనక్కి నెట్టాడు. వేగం, కచ్చితత్వం, దూకుడు ఆటతో అతను ఆరంభంలోనే ఆధిపత్యం నెలకొల్పగా, తీవ్రమైన వత్తిళ్లమధ్య కూడా పోరాడే యోధుడిగా పేరుగాంచిన అకాలే, భారత ఆటగాడి వేగాన్ని అందుకోవడానికి ఇబ్బంది పడ్డాడు. మూడవ రౌండ్‌లో సుమారు 40 సెకన్లు మిగిలి ఉండగా, దేవ్ అకాలే పరిస్థితిని సద్వినియోగం చేసుకుని, కొన్ని బరువైన, బలమైన ఎడమ చేతి గుద్దులతో పూర్తిస్థాయి దాడికి దిగడంతో. దేవ్ కు విజయం లభించింది.

19న మహానది కోల్‌ఫీల్డ్స్ ఐపిఒ

కోల్‌ఇండియా సబ్సిడరీనుంచి మరిన్ని ఐపిఒలు



ముంబయి, నవంబరు 15: స్టాక్ ఇన్వెస్టర్ల కోసం మరో ఐపిఒ అందుబాటులోకి వస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా సబ్సిడరీ మహానది కోల్‌ఫీల్డ్స్ ఐపిఒకు సెబీ ఆమోదం లభించింది. తాజాగా రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు ఇంకా సెబీ, బిఎస్ఇ, ఎన్ఎస్ఇలకు సబ్‌స్క్రిప్షన్ తేదీలతో కూడిన రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజి ఫైలింగ్‌లో వెల్లడించింది. మహానది కోల్‌ఫీల్డ్స్ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 19న ప్రారంభం కానుంది. బిడ్డింగ్‌కు ఆఖరి తేదీ నవంబరు 23. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో రానుంది.ప్రమోటర్ కోల్ ఇండియా తన వాటాలో సుమారు 10 శాతం విక్రయించనుంది. మొత్తం ఇక్కడ 66.18 కోట్ల ఈక్విటీ షేర్లను ఓఎఫ్ఎస్ కింద ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉంచుతుంది. దీంతో ఐపిఒ ద్వారా సమీకరించే నిధులు మొత్తం ప్రమోటర్ కంపెనీకే వెళ్తాయి. ఇష్యూ సైజ్ రూ. 9500కోట్లుగా ఉంటుందని అంచనా. అంటే 66.18 కోట్ల షేర్ల విక్రయం ద్వారా రూ.9500 కోట్ల మేర నిధులు సమీకరించనున్నట్లు తెలుస్తోంది. ఇంకా ప్రైస్ బ్యాండ్, లాట్ సైజ్, కనీస పెట్టుబడి వివరాల్ని ప్రకటించలేదు. 1 2 రోజుల్లో దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. నవంబరు 27న ఇది స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎస్బిఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తుండగా, కేఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఇష్యూ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తోంది. కోల్ ఇండియా నుంచి ఈ ఏడాది వరుసగా ఐపీఓలు వస్తున్నాయి. 2030 కల్లా కోల్ ఇండియా తన 8 అనుబంధ సంస్థల్ని స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటికే భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిస్టయ్యాయి. ఇప్పుడు మహానది కోల్‌ఫీల్డ్స్ నవంబరులో రానుండగా, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ కూడా ఇప్పటికే డిఆర్‌హెచ్‌పి ఫైల్ చేయగా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఐపిఒకు తీసుకురానుంది. నెక్స్ట్ ఇంకా నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్,ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ సెంట్రల్ కోల్‌ఫీల్డ్ లైన్‌లో ఉన్నాయి.

వారంలో 31 కంపెనీలు డివిడెండ్లు



ముంబయి, నవంబరు 15: స్టాక్ మార్కెట్లలో దాదాపు 31 కంపెనీలు ఇటీవల స్టాక్ స్ప్లిట్, డివిడెండ్ వంటి ఆఫర్లను ప్రకటించగా ఈ వారంలోనే రికార్డు తేదీలు ఉన్నాయి. అంటే ఈ ప్రయోజనం పొందడానికి మరికొద్ది రోజులే ఉంది. వీటిలో ప్రముఖ టైర్ల తయారీ సంస్థ ఎంఆర్ఎఫ్ సహా ఆయిల్ ఇండియా, కొచ్చిన్ షిప్‌యార్డ్, మణప్పురం ఫైనాన్స్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇలా దాదాపు 31 కంపెనీలు ఉన్నాయి. ఈనెల 16 -20 మధ్య ఈ రికార్డు తేదీలు ఉన్నాయి. ఈ స్టాక్ స్ప్లిట్, డివిడెండ్లకు అర్హత పొందాలంటే రికార్డు తేదీకి ముందటి రోజే ఆయా కంపెనీల షేర్లను డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉండాలి. 16వ తేదీ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఒక్కో షేరుకు రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించగా సోమవారమే ఎక్స్ డివిడెండ్ కానుంది. కొచ్చిన్ షిప్‌యార్డ్ రూ. 6 డివిడెండ్ ప్రకటించింది. ఎఎస్ఎం టెక్నాలజీస్ కూడా రూ.6 చొప్పున డివిడెండ్ ఇస్తోంది. వీటన్నింటికీ సోమవారమే రికార్డు తేదీ. ఆస్ట్రేలియన్ ప్రీమియం సోలార్ రూ. 0.15 చొప్పున, ఇండాక్ రబ్బర్ రూ. 0.9 చొప్పున డివిడెండ్ ఇస్తోంది. బీఎన్ ఆగ్రోకెమికల్స్ స్టాక్ 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ ప్రకటించగా సోమవారమే రికార్డ్ డేట్‌గా ఉంది.
నఫైనాన్స్ కార్పొరేషన్ రూ. 4.1 చొప్పున డివిడెండ్ ప్రకటించగా మంగళవారం రికార్డు తేదీ.ఎంఆర్ఎఫ్ కూడా ఒక్కో షేరుకు రూ. 3 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఓరియెంటల్ ఇన్‌ఫ్రా ట్రస్ట్, పవర్ గ్రిడ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ కూడా ఎక్స్ డివిడెండ్ కానుంది. ఈనెల 18 పేజ్ ఇండస్ట్రీస్ ఒక్కో షేరుకు రూ. 150 మధ్యంతర డివిడెండ్ ఆఫర్ చేయగా బుధవారం రికార్డు తేదీ. ఏకే క్యాపిటల్ సర్వీసెస్ రూ. 18, మణప్పురం ఫైనాన్స్, ఎఆర్ సిఎల్ ఆర్గానిక్స్ రూ. 1 చొప్పున డివిడెండ్ ప్రకటించగా ఈనెల18 లాస్ట్ డేట్. బుధవారం డివిడెండ్ కోసం రికార్డు తేదీగాఉన్న ఇతర స్టాక్స్‌లో టీడీ పవర్ సిస్టమ్స్ (రూ. 0.65), కాన్‌ప్లెక్స్ సినిమేసెస్ (రూ. 0.5), రాయల్ ఆర్క్ ఎలక్ట్రోడ్స్ (రూ. 0.5) ఉన్నాయి. ఇదే తేదీన ప్రాక్సిస్ హోం రిటైల్, ఐరన్‌వుడ్ ఎడ్యుకేషన్ స్టాక్స్ రైట్ ఇష్యూలకు రికార్డు డేట్‌గా ఉంది.

భారత్ ఆర్థికవృద్ధి 7.2%

వాణిజ్యం



చైనాను అధిగమిస్తుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా

న్యూఢిల్లీ, నవంబరు 15: భారత ఆర్థిక వ్యవస్థ రాబోయే రోజుల్లోనూ తన జోరును కొనసాగించనుందని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్ వెల్లడించింది. 2027 నాటికి భారత్ 7.2 శాతం జిడిపి వృద్ధి రేటును నమోదు చేసి, పొరుగున ఉన్న చైనాకంటే వేగంగా అభివృద్ధి చెందుతుందని తమ తాజా రీసెర్చ్ నివేదికలో స్పష్టం చేసింది. ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రగామిగా నిలవనుందని తెలిపింది. గోల్డ్‌మన్ శాక్స్ రీసెర్చ్ నివేదిక ప్రకారం, 2027లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ 2.8 శాతం మేర వృద్ధి చెందే అవకాశం ఉంది. ఇది 2026లో అంచనా వేసిన 2.7 శాతం కంటే స్వల్పంగా ఎక్కువ. ప్రపంచ వ్యాప్తంగా కఠిన ఆర్థిక పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ఇంధన ధరలు తగ్గడం మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారీ పెట్టుబడులు వస్తుండటం ఆర్థిక రంగానికి ఊతమిస్తాయని నివేదిక పేర్కొంది. గోల్డ్‌మన్ శాక్స్ ప్రధాన ఆర్థికవేత్త, రీసెర్చ్ విభాగం అధిపతి జాన్ హట్జియస్ ఈ పరిణామాలపై స్పందిస్తూ ఇంధన ఖర్చులు, సాంకేతిక రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వాల ద్రవ్య విధానాలు ప్రపంచ వృద్ధికి ప్రధాన చోదకాలుగా మారుతున్నాయని తెలిపారు. 2027లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన, సాధారణ స్థాయి జిడిపి వృద్ధిని నమోదు చేయవచ్చని ఆయన చెప్పారు. ఈ క్రమంలో భారత్ 7.2 శాతం వృద్ధి సాధిస్తుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. మార్కెట్ సాధారణ అంచనా అయిన 6.8 శాతం కంటే ఇది అధికం కావడం గమనార్హం. 2026 సంవత్సరానికి భారత్ వృద్ధి రేటును 7.9 శాతంగా అంచనా వేశారు. మరోవైపు చైనా ఆర్థిక వ్యవస్థ 2027లో 4.5 శాతానికే పరిమితం కావచ్చని నివేదిక పేర్కొంది. చైనాలో రియల్ ఎస్టేట్ రంగ సమస్యలు, దేశీయ వినియోగం మందగించినప్పటికీ, ఎగుమతులు ఆ దేశానికి కొంతవరకు అండగా నిలుస్తాయని విశ్లేషించింది. అమెరికా, జపాన్, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు మార్కెట్ అంచనాల కంటే మెరుగైన వృద్ధిని నమోదు చేస్తాయని గోల్డ్‌మన్ శాక్స్ పేర్కొంది. ఎఐ ఎగుమతులకు అంతర్జాతీయంగాఉన్న బలమైన డిమాండ్ కారణంగా దక్షిణ కొరియా, తైవాన్ దేశాలు బాగా లబ్ధి పొందుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఎఐ రంగంలో పెట్టుబడులు 2026 నాటి 1.1 ట్రిలియన్ డాలర్ల నుంచి 2027 నాటికి ఏకంగా 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటాయని నివేదిక అంచనా వేసింది. ప్రధానంగా అమెరికాలో హార్డ్‌వేర్ రంగంలోనే 500 బిలియన్ డాలర్లకు పైగా వ్యయం పెరగనుంది. ఇది ప్రపంచ జిడిపి వృద్ధికి 0.4 శాతం మేర దోహదం చేస్తుందని నిపుణులు విశ్లేషించారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గడం ఆర్థిక కార్యకలాపాలకు కలిసిరానుంది. 2027 చివరి నాటికి బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 78డాలర్లకు దిగివస్తుందని, ఎల్ఎన్‌జి ధరలుకూడా తగ్గుముఖం పడతాయని గోల్డ్‌మన్‌శాక్స్ కమోడిటీ నిపుణులు అంచనా వేశారు. ఐరోపా దేశాలు మాత్రం పెరిగిన ఇంధన ఖర్చులప్రభావాన్ని మరికొంత కాలంపాటు ఎదుర్కోవాల్సి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది.

పాజిటివ్ రిటర్నులు ఫండ్స్‌లోనే ఎక్కువ



ముంబయి, నవంబరు 15: వారంలో మూమువల్‌ఫండ్స్‌కు మంచి లాభాలే అందాయి. గరిష్ఠంగా 8 శాతం వరకు రాబడి వచ్చింది. మొత్తం 54 ఫండ్స్ నెగెటివ్ రిటర్న్స్ అందించగా, 572 పాజిటివ్ రిటర్న్స్ ఇచ్చాయి. కనీసం 3 శాతానికిపైగా పెరిగిన 11స్కీమ్స్ ఉన్నాయి. గతవారంలో బిఎస్ఇ సెన్సెక్స్ 0.59 శాతం పెరగ్గా, నిఫ్టీ 50 0.39 శాతం ఎగబాకాయి. అత్యధికంగా ఇక్కడ నిప్పన్ ఇండియా తైవాన్ ఈక్విటీ ఫండ్ 7.62 శాతం రాబడితో టాప్‌లో నిలిచింది. ఇది ఇంటర్నేషనల్ ఫండ్ కావడం విశేషం. ఇన్వెస్కో ఇండియా మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు స్కీమ్స్ ఉన్నాయి. ఇన్వెస్కో ఇండియా ఇన్వెస్కో గ్లోబల్ కన్జూమర్ ట్రెండ్స్ ఎఫ్ఒఎఫ్, ఇన్వెస్కో ఇండియా నాస్‌డాక్ 100 ఇటిఎఫ్, ఫండ్‌ఆఫ్ ఫండ్స్ వరుసగా 7.62 శాతం, 4.52 శాతం రిటర్న్స్ ఇచ్చాయి. మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ నుంచి మోతీలాల్ ఓస్వాల్ యాక్టివ్ మూమెంటమ్ ఫండ్, మోతీలాల్ ఓస్వాల్ మిడ్‌క్యాప్ ఫండ్ వరుసగా 3.43 శాతం, 3.32 శాతం రిటర్న్స్ ఇచ్చాయి. ఇన్వెస్కో ఇండియా ఇన్వెస్కో పాన్ యూరోపియన్ ఈక్విటీ ఎఫ్ఒఎఫ్ ఇంటర్నేషనల్ స్కీమ్ 3.24 శాతం రాబడి అందించింది. మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ నుంచి మోతీలాల్ ఓస్వాల్ స్పెషల్ అపార్చునిటీస్ ఫండ్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్ వరుసగా 3.05 శాతం, 3.03 శాతం రాబడి ఇచ్చాయి. యాక్సిస్ గ్లోబల్ ఇన్నోవేషన్ ఎఫ్ఒఎఫ్ ఇంటర్నేషనల్ ఫండ్ 3.02 శాతం రిటర్న్స్ ఇచ్చింది.

లిస్టింగ్‌పై నోయెల్ టాటా మళ్లీ అభ్యంతరం

ముంబయి, నవంబరు 15: టాటాగ్రూప్ ఛైర్మన్‌గా రతన్‌టాటా నిష్క్రమణం తర్వాత వారసులు,ప్రస్తుత యాజమాన్యంమధ్య విబేధాలు తారస్థాయికి చేరినసంగతి తెలిసిందే. తాజాగా టాటా సన్స్ లిస్టింగ్ గురించి మరోసారి టాటా కీలక వ్యాఖ్యలు చేశారు. టాటా సన్స్ లిస్టింగ్ జరిగితే గనుక తరతరాలుగా కొనసాగుతున్న గ్రూప్ వ్యాపార విలువలు మారిపోయే ప్రమాదం ఉందని నోయల్ టాటా ఆందోళన వ్యక్తం చేశారు.హెచ్‌టి లీడర్‌షిప్ సమిట్‌లో మాట్లాడిన ఆయన టాటా సన్స్ స్టాక్ మార్కెట్లో లిస్టయితే వేలాది మంది వాటాదారుల ఒత్తిడి పెరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో 30 వేల నుంచి 40 వేల వాటాదారులు ఉంటే దాతృత్వ కార్యక్రమాల కంటే లాభాలకే, ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితి రావొచ్చని అభిప్రాయపడ్డారు. అదే జరిగితే తరతరాలుగా టాటా గ్రూప్ అనుసరిస్తున్న వ్యాపార విధానం అలానే సామాజిక బాధ్యతల్లో మార్పు వస్తుందని హెచ్చరించారు. టాటా సన్స్‌లో ప్రస్తుతం టాటా ట్రస్ట్స్‌కు సుమారు 66 శాతం వాటా ఉంది. షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్‌కు 18.37 శాతం వాటా ఉంది. తమ పెట్టుబడికి తగిన విలువ రావాలంటే టాటా సన్స్ స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలని షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ కోరుతోంది. కానీ టాటా ట్రస్ట్స్ మాత్రం ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని భావిస్తోంది. ఈ వ్యవస్థ వల్లే టాటా గ్రూప్ తన ప్రత్యేక గుర్తింపును, దాతృత్వ కార్యక్రమాలను తరతరాలుగా కొనసాగించగలదని నోయల్



అభిప్రాయపడుతున్నారు. టాటా సన్స్ లిస్టింగ్ చర్చకు ఆర్బీఐ నిర్ణయం మరింత ఊతం ఇచ్చింది. 2026 సెప్టెంబరులో టాటా సన్స్ తన కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ లైసెన్స్ వదులుకోవడానికి చేసిన దరఖాస్తును ఆర్బీఐ తిరస్కరించింది. దీంతోనే ఆర్బీఐ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా మార్కెట్లో లిస్టింగ్ కావాల్సిన పరిస్థితి తలెత్తింది. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్